teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 90 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 23 జూలై 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## నీట్ పరీక్ష పత్రం లీకేజీపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

### సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ అనుమానం వ్యక్తం



న్యూ ఢిల్లీ, జులై 22 (తీన్మార్ న్యూస్): నీట్-యూజీ 2024 పరీక్ష పత్రం లీకేజీపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ సందర్భంగా నిందితులకు మే4వ తేదీ రాత్రి గుర్తుంచుకోవాలని చెప్పారంటే ఆ తేదీ కంటే ముందే జరిగి ఉండొచ్చని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ అనుమానం వ్యక్తం చేశారు. అలా అయితే స్ట్రాంగ్ రూమ్ వాలెట్‌లో ప్రశ్నపత్రం బయటకు వచ్చిందా అని ప్రశ్నించారు. బిహార్ పోలీసుల దర్యాప్తు రిపోర్టును ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 161

మిగతా 2 లో

# సభా సమయం

## నేడు ప్రారంభంకానున్న అసెంబ్లీ సమావేశాలు

## సమావేశాల్లో కీలక బిల్లులకు ఆమోదం

- ముఖ్యమైన అంశాలపై చర్చలు
- జాబ్ క్యాలెండర్, రైతు భరోసా విధివిధానాలపై ఫోకస్
- కమిషన్ల ఏర్పాటు, రిజర్వేషన్ల పెంపుపై నిర్ణయాలు



హైదరాబాద్, జులై 22 (తీన్మార్ న్యూస్): నేటి నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలకు రాష్ట్ర సర్కారు పక్కా ప్లాన్‌తో రెడీ అయింది. పాలనలో దూకుడుగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఈ అసెంబ్లీ సమావేశాల్లో కీలక బిల్లులకు ఆమోదంతోపాటు ముఖ్యమైన అంశాలపై చర్చించి, కీలక నిర్ణయాలు తీసుకోనున్నది. 10 నుంచి 12 రోజుల పాటు జరపనున్న వర్షాకాల సమావేశాల్లో

మిగతా 2 లో



## రాష్ట్రంలో భారీ వర్షాలు..

# "బడి పిల్లలకు" తప్పని పాట్లు

ఉరుములు, మెరుపులకు ఉలిక్కి పడుతున్న పిల్లలు

పాఠశాలకు సెలవులు ఇవ్వాలంటూ డిమాండ్స్

తెలంగాణ బ్యూరో, జులై 22 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో కొన్ని రోజులుగా భారీ వర్షాలు పడుతున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో అన్ని చోట్లా వరుణుడు చెలరేగిపోతున్నాడు. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలన్ని కూడా నీట మునుగుతున్నాయి. బ్యారేజీల్లో నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్నది. చెరువులు, కాలువలు

మిగతా 2 లో



## జల్‌శక్తి మంత్రి పాటిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ

మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు సహకారాన్ని కోరిన సీఎం

రూ. 6 వేల కోట్ల నిధులు కేటాయించండి

కేంద్ర జల్ శక్తి మంత్రి పాటిల్ కు సీఎం రేవంత్ వినతి

.. వివరాలు 2లో

### రహదారుల మరమ్మతులుపై

## రోడ్లు, భవనాలశాఖ దృష్టి

### ఫొటో తీసి ఆప్‌లో పెడితే.. మరమ్మతులు

తొలుత జీహెచ్ఎంసీలో అమలుకు యోచన

ఇప్పటికే ఒక యాప్‌ను తీసుకొచ్చిన కర్ణాటక సర్కార్

అధ్యయనానికి అధికారులను పంపనున్న ఆర్అండ్‌బీ

పకడ్బందీగా యాప్‌ను తీసుకొచ్చేందుకు కసరత్తు

హైదరాబాద్, జులై 22 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని రహదారులపై గుంతలను గుర్తించడంతోపాటు సాధ్యమైనంత త్వరగా మరమ్మతులు చేపట్టడంపై రోడ్లు, భవనాల శాఖ దృష్టి సారించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. ఇందుకు సాంకేతిక

మిగతా 2 లో






## కొత్తగా పట్టా పాసబుక్ వచ్చిన "రైతు"లకు భీమాకు అవకాశం

### అర్హులైన కొత్త రైతుల నుండి దరఖాస్తుల ఆహ్వానం

తెలంగాణ బ్యూరో, జులై 22 (తీన్మార్ న్యూస్): తెలంగాణలోని రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం మరో మరో కీలక ప్రకటన చేసింది. రైతు భీమా పథకానికి అర్హులైన కొత్త రైతులకు అవకాశం కల్పిస్తూ దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ దరఖాస్తులను ఆగస్ట్ 5వ తేదీలోగా సమర్పించాలని ఓ ప్రకటనలో

మిగతా 2 లో



## ప్రతి ఏటా 78లక్షల ఉద్యోగావకాశాలు కల్పించాలి

### పార్లమెంటులో ఆర్థిక సర్వేను ప్రవేశ పెట్టిన కేంద్ర ఆర్థిక మంత్రి

న్యూ ఢిల్లీ, జులై 22 (తీన్మార్ న్యూస్): ప్రతిఏటా 78 లక్షల మందికి తప్పనిసరిగా ఉద్యోగావకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సర్వే పేర్కొంది. 2024-25 ఆర్థిక సంవత్సరం వృద్ధి, దేశంలో ఆర్థిక పరిస్థితి స్థితిగతులపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం పార్లమెంటులో ఆర్థిక సర్వేను

మిగతా 2 లో

## ఉద్యమకారుల స్మృతివనానికి వంద ఎకరాలు కేటాయించాలి

### ప్రధాని నరేంద్ర మోదీకి లేఖలు రాసిన టిబీజేపీ ఎంపీలు



హైదరాబాద్, జులై 22 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ 1969 తెలంగాణ ఉద్యమకారుల స్మృతివనానికి కంటోన్మెంట్ ఏరియాలో వంద ఎకరాలు కేటాయించాలని బీజేపీ ఎంపీలు డీకే అరుణ, రఘునందన్ రావు, నగేశ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, అర్వింద్, ఈటల రాజేందర్ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖలు

మిగతా 2 లో



## ఆరోగ్యశ్రీ చికిత్స ధరలను సవరించిన సర్కార్

1,375 ప్యాకేజీల ధరలను సవరిస్తూ జీవో 30 జారీ

మిగిలిన 297 ప్యాకేజీ మార్పు లేదని ప్రభుత్వం స్పష్టం

.. వివరాలు 2లో

## ప్రభుత్వంపై కెసిఆర్ విమర్శలకు ఎద్దేవా చేసిన మంత్రి కోమటిరెడ్డి

### రూ.7 లక్షల కోట్లు అప్పుచేసి నాసిరకం ప్రాజెక్టు కట్టారని ఫైర్



హైదరాబాద్, జులై 22 (తీన్మార్ న్యూస్): వచ్చే నెల నాటికి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం మాని సంపాదించిన దాంతో ఏదో ఒక దేశం పోయి బతికితే మంచిదని కేసీఆర్

మిగతా 2 లో



## వికలాంగులపై స్మితా సబర్వాల్ ఐఏఎస్ అనుచిత వ్యాఖ్యలు

ఇది ప్రభుత్వం ఆలోచనా లేక ఆవిడ మాటలా..?

ప్రశ్నించిన సివిల్స్ ఎగ్జామ్ కోచ్ బాల లత

హైదరాబాద్, జులై 22 (తీన్మార్ న్యూస్): వికలాంగులపై సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం. ఇది ప్రభుత్వం ఆలోచనా లేక

మిగతా 2 లో

## వచ్చే ఐదేళ్లలో ఆర్టీసీలో భారీ స్థాయిలో ఖాళీలకు అవకాశం

### అధికార వర్గాల విశ్వసనీయ సమాచారం




తెలంగాణ బ్యూరో, జులై 22 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఆర్టీసీలో వచ్చే ఐదేళ్లలో 10 వేల ఖాళీలు ఏర్పడనున్నట్లు అధికార వర్గాల అంచనా సమాచారం. ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 నుంచి 60 ఏళ్లకు పెంచడంతో 2020, 2021లో ఎవరూ పొందలేదు. 2022 నుంచి రిటైర్మెంట్లు జరుగుతుండగా 2023లో ఏకంగా

మిగతా 2 లో



## రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేసిన అధికారులు

### గోదావరి నదిలో 50 అడుగుల నీటిమట్టం నమోదు

భద్రాచలం, జులై 22 (తీన్మార్ న్యూస్): తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల్లో కూడా వానలు దంచి కొడుతున్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పలు నదులకు వరద తాకిడి

మిగతా 2 లో

# సభా సమయం



**మొదటి పేజీ తరువాయి**

పూర్తిస్థాయి బడ్జెట్‌కు ఆమోదం తెలపడంతోపాటు స్కిల్‌యూనివర్సిటీ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం తీసుకోనున్నారు. ఈ సమావేశాల్లోనే జాబ్ క్యాలెండర్ ను ప్రకటించనున్నారు. రైతు భరోసా విధి విధానాలు, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల్లో అక్రమంగా లబ్ధి పొందిన వారినుంచి రికవరీ, తెలంగాణ తల్లి విగ్రహం, రాష్ట్ర చిహ్నం తదితర అంశాలపై చర్చించి, తీర్మానం చేయనున్నారు. విద్య, వ్యవసాయ కమిషన్ల ఏర్పాటుపై చర్చించనున్నారు. ధరణిలో జరిగిన అక్రమ వ్యవహారాలపై ప్రభుత్వం వైట్ పేపర్ పెట్టనున్నది. అన్నింటిపై సుదీర్ఘంగా చర్చిస్తూనే గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టనున్నది. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించి డ్రాఫ్ట్ బిల్లును ఇప్పటికే రెడీ చేశారు. బడ్జెట్‌కు ఆమోదం తెలిపిన వెంటనే స్కిల్‌యూనివర్సిటీ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి, ఆమోదం తీసుకోనున్నారు. ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో (పీపీపీ మోడల్‌లో) స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. స్వయం ప్రతిపత్తి ఉండేలా దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. మూడు, నాలుగేండ్ల కాల వ్యవధి ఉండే డిగ్రీ కోర్సులతోపాటు ఏడాది డిప్లొమా, మూడు నుంచి నాలుగు నెలల వ్యవధి ఉండే సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తారు. మొత్తం 17 ప్రాధాన్య రంగాలైన ఫార్మా, కన్‌స్ట్రక్షన్, బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్, ఈ కామర్స్ అండ్ లాజిస్టిక్స్, రిటైల్, యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్ గేమింగ్ అండ్ కామిక్స్ వంటివి ఉన్నాయి. తొలి ఏడాది 2 వేల మందితో ప్రారంభించి, క్రమంగా ఏడాదికి 20 వేల మందికి ఈ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పించేలా యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మొదటి బిల్లు స్కిల్ యూనివర్సిటీదే కావడం విశేషం.

**జాబ్ క్యాలెండర్ సిద్ధం**

ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. జాబ్ క్యాలెండర్ ఎలా ఉంటుంది? ప్రతి ఏటా నియామక ప్రక్రియ ఎలా చేపడతాం? అనేది అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించనున్నది. ఇప్పటికే ఆర్థిక శాఖ, రిక్రూట్ మెంట్ బోర్డులతో సంప్రదించి జాబ్ క్యాలెండర్‌ను రూపొందించింది. ప్రతి ఏటా మార్చి చివరి నాటికి ఉద్యోగ ఖాళీలను సేకరించనున్నారు. ఆ తర్వాత సెంట్రల్‌ఎగ్జామ్స్, రాష్ట్రంలో వివిధ రిక్రూట్‌మెంట్ బోర్డులు ఏ టైంలో ఎగ్జామ్స్ నిర్వహిస్తారనేది స్పష్టతనిస్తారు. యూపీఎస్సీ తరహాలో జాబ్ క్యాలెండర్ తయారు చేశారు. జూన్ 2వ తేదీకల్లా నోటిఫికేషన్లు ఇచ్చి డిసెంబర్9 కల్లా పోస్టులను భర్తీ చేయనున్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటిసారి జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తుండడంతో నిరుద్యోగుల్లో ఆసక్తి నెలకొన్నది.

**రైతు భరోసా విధి విధానాలపై ప్రకటన**

రైతు భరోసా విధి విధానాలపైనా అసెంబ్లీలో చర్చించి, ప్రకటన చేయనున్నారు. కౌలు రైతులకు పెట్టుబడి సాయంపైనా స్పష్టత ఇవ్వనున్నారు. ఇప్పటికే ఈ స్కీమ్‌పై మంత్రులు జిల్లాల్లో పర్యటించి, రైతుల నుంచి ఫీడ్ బ్యాక్‌తీసుకున్నారు. వాటన్నింటిపైనా చర్చించి ఎన్ని ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలి? ఎంత విస్తీర్ణంలో పంటలు సాగైతే అంత వరకే ఇవ్వాలా? లేక వ్యవసాయ భూములన్నింటికీ కొంత సీలింగ్‌పెట్టి ఇవ్వాలా? అనేదానిపై నిర్ణయం వెల్లడించనున్నారు. గత ప్రభుత్వం రైతుబంధు కింద ఏకంగా రాళ్లు, గుట్టలు, హైవేల వంటి సాగుకు యోగ్యం కాని భూములకు రూ.26 వేల కోట్ల మేర దుబారాగా చెల్లించినట్టు ప్రభుత్వం గుర్తించింది. అదే సమయంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులకు పంట పెట్టుబడి సాయం అవసరం లేదనే వాదన ఉండగా దీనిపైనా నిర్ణయం తీసుకోనున్నారు.

**రికవరీ విద్య, వ్యవసాయ కమిషన్ల ఏర్పాటు**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అర్హత లేకున్నా వివిధ సంక్షేమ పథకాల కింద కొందరు లబ్ధి పొందారు. దీంతో ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ విషయమై ఎలా ముందుకు వెళ్లాలనే దానిపైనా చర్చించి, విధివిధానాలు రూపొందించనున్నారు. విద్య, వ్యవసాయంపై ఫోకస్ పెట్టిన ప్రభుత్వం రెండింటికీ వేర్వురుగా కమిషన్లు ఏర్పాటు చేయాలనుకుంటున్నది. వీటిపైనా కూడా అసెంబ్లీలో చర్చించి, తీర్మానం చేయనున్నట్టు తెలిసింది.

**బీసీ రిజర్వేషన్లు తెలంగాణ తల్లి విగ్రహం రాష్ట్ర చిహ్నం**

పంచాయతీ ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్ల పెంపుపైనా అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది. ఇప్పటికే గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన నడుస్తున్నది. అదే సమయంలో స్పెషల్ ఆఫీసర్లు ఉంటే కేంద్రం నుంచి వచ్చే నిధులు ఆగిపోయే ప్రమాదం ఉన్నది. దీంతో ఇప్పటికిప్పుడు కుల గణన సాధ్యం కాకపోతే ఏ రకంగా బీసీ రిజర్వేషన్లు పెంచాలనే దానిపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తున్నది. అలాగే, తెలంగాణ తల్లి విగ్రహంపైనా చర్చించనున్నారు. ఇప్పటికే దీనిపై గతంలో విపక్షాలు విమర్శలు చేశాయి. రాష్ట్ర చిహ్నం కూడా ఉద్యమ స్ఫూర్తిని కలిగించేలా, తెలంగాణ చరిత్ర కనిపించేలా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దీంతో ఈ రెండింటిపైనా నిర్ణయం తీసుకోనున్నారు.

## జల్‌శక్తి మంత్రి పాటిల్ తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ

న్యూ ఢిల్లీ, జులై 22 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ ను కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి కేంద్రమంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలోని మురికి నీరు అంతా మూసీలో చేరుతోందని, దానిని శుద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. జాతీయ నది పరిరక్షణ ప్రణాళిక కింద మూసీలో మురికి నీటి శుద్ధి పనులకు రూ.4 వేల కోట్లు కేటాయించాలని కోరారు. హైదరాబాద్ కు తాగునీరందించే జంట జలాశయాలను (ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్) గోదావరి నది జలాలతో నింపే పనులకు రూ.6 వేల కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌ను గోదావరి నీటితో నింపితే హైదరాబాద్ నీటి ఇబ్బందులు ఉండవని కేంద్ర మంత్రికి వివరించారు. 2019లో జల్ జీవన్ మిషన్ ప్రారంభమైనా ఈ పథకం కింద ఇప్పటి వరకు తెలంగాణకు నిధులు ఇవ్వలేదని సీఎం కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. తెలంగాణలో 7.85 లక్షల ఇళ్లకు నల్లా కనెక్షన్ లేదని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నల్లా కనెక్షన్లు లేని ఇండ్లతో పాటు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద చేపట్టే ఇండ్లకూ నల్లా కనెక్షన్లు ఇచ్చేందుకు రూ.16,100 కోట్ల వ్యయమవుతుందని తెలిపారు. ఈ ఏడాది నుంచి జల్‌జీవన్ మిషన్ నిధులు తెలంగాణకు కేటాయించాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

## రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేసిన అధికారులు

**మొదటి పేజీ తరువాయి**

పెరిగింది. ఈ క్రమంలో భద్రాచలం దగ్గర గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ఉపనదులు పొంగిపొర్లడంతో గోదావరికి వరద తాకిడి పెరిగింది. భద్రాచలం వద్ద గోదావరి నదిలో 50 అడుగుల నీటిమట్టం నమోదయింది. ఈ నేపథ్యంలో రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు అధికారులు. ఇంద్రావతి ప్రాణహిత ఉపనదుల నుండి భారీగా వరద నీరు గోదారిలో కలుస్తోందని సమాచారం. ఎగువనున్న ఛత్తీస్గఢ్ రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దిగువన ఉన్న చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టులోకి భారీ వరద నీరు వచ్చి చేరుతోందని తెలిపారు అధికారులు. ప్రాజెక్టుకు చెందిన ఇరవై ఒక్క గేట్లను ఎత్తి నీటిని గోదావరిలోకీ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు అధికారులు. సుమారు 11.50 లక్షల క్యూసెక్కుల వరద నమోదు అవుతుందిని, ఈరోజు రాత్రి 9 గంటలకు 51.20 అడుగులకు చేరుకుంటుందని సిడబ్ల్యుసి అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి శాంతిస్తున్నట్టు కనిపించినప్పటికీ మంగళవారం రాత్రికి 53 అడుగులు దాటి ప్రవహించే అవకాశం ఉన్నట్లు కేంద్ర జల వనరుల సంఘం తెలిపింది.

## ప్రతి ఏటా 78లక్షల ఉద్యోగావకాశాలు కల్పించాలి

**మొదటి పేజీ తరువాయి**

ప్రవేశ పెట్టారు. శ్రామికశక్తిని పెంపొందించడానికి వ్యవసాయేతర రంగంలో 2030 వరకూ ఏటా 78 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిందేనని ఆర్థిక సర్వే తేల్చి చెప్పింది. వ్యవసాయేతర రంగాల్లో ఉద్యోగాలు కల్పించాల్సి ఉందని పేర్కొన్న ఆర్థిక సర్వే 2023–24లో వ్యవసాయ రంగంలో శ్రామిక శక్తి 45.8 శాతం ఉందని, 2047 నాటికి అందులో నాలుగోవంతుకు తీసుకు రావాలని ప్రతిపాదించింది. మహిళలకు ఉపాధి కల్పించే వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఉపాధి అవకాశాలకు ఉన్న ప్రాధాన్యానికి అనుగుణంగా వ్యవసాయేతర రంగాల్లో ఏటా 78 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాల్సి ఉంది' అని ఆర్థిక సర్వే పేర్కొంది. తదనుగుణంగా గత ఐదేండ్లుగా ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సియేటివ్ (పీఎల్ఐ) పథకాల ద్వారా 60 లక్షల మందికి, మిత్రా టెక్స్ టైల్ స్కీమ్, ముద్ర రుణాల ద్వారా 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించినట్లు పేర్కొంది. కంపెనీల్లో ఫ్లెక్సీ వర్కర్ల నియామకం పెరుగుతున్నదని, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని ఆర్థిక సర్వే నొక్కి చెప్పింది. దేశంలోని వివిధ కంపెనీల్లో సుమారు 54 లక్షల మంది ఫార్మల్ కాంట్రాక్ట్ స్టాఫ్ లేదా ఫ్లెక్సీ వర్కర్లు పని చేస్తున్నారు. వీరికి సకాలంలో వేతనాల చెల్లింపు, సామాజిక భద్రత, వైద్య బీమా వసతులు కల్పించాల్సిన బాధ్యత ఈ కంపెనీలపైనే ఉంది. కాంట్రాక్టు వర్కర్లకు పూర్తిగా సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత కంపెనీలదే. 2023లో సగటున కాంట్రాక్టు ఉద్యోగుల నియామకాలు 75 శాతానికి పైగా పెరిగాయి' అని ఆర్థిక సర్వే వెల్లడించింది.

## నీట్ పరీక్ష పత్రం లీకేజీపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

**మొదటి పేజీ తరువాయి**

వాంగ్మూలాలు పేపర్ లీక్ మే 4వ తేదీ కంటే ముందే చోటుచేసుకొందని బలంగా చెబుతున్నట్లు పిటిషనర్లు పేర్కొన్నారు. బిహార్ పోలీసుల రిపోర్టు ప్రకారం సంబంధిత ప్రాంతల్లో ప్రశ్నపత్రాలను డిపాజిట్ చేయటానికి ముందే లీకైందని తెలిపారు. కచ్చితంగా ఓ గ్యాంగ్ ఎప్పటినుంచో ఈ పని చేస్తోందని పేర్కొన్నారు. సంజీవ్ ముఖియా, ఇతర కీలక నిందితులు అరెస్టు కాలేదనే విషయాన్ని గుర్తు చేశారు. ఒకచోట ప్రశ్నపత్రాన్ని రిక్షాలో కూడా తరలించారని ఆయన న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు.

**సుప్రీంకోర్టులో పిటిషన్లు**

కాగా నీట్–యూజీ 2024కు సంబంధించి దాఖలైన పిటిషన్లపై సోమవారం నుంచి సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్ర ధర్మాసనం విచారణ చేపడుతోంది. ఇందులో నీట్‌కు సంబంధించిన 40 పిటిషన్లు ఉన్నాయి. వీటిల్లో వివిధ రాష్ట్రాల్లోని హైకోర్టుల్లో దాఖలైన పిటిషన్లు అన్నింటిని సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలన్న ఎన్‌టీఏ అభ్యర్థన కూడా ఉంది.'

## రాష్ట్రంలో భారీ వర్షాలు.. "బడి పిల్లలకు" తప్పని పాట్లు

**మొదటి పేజీ తరువాయి**

ఐతే పొంగి పొర్లుతున్నాయి. పలు చోట్ల గండ్లు పడ్డాయి. ఇక హైదరాబాద్‌లో పరిశీలిస్తే పలు ప్రాంతాల్లో వరద ఎఫెక్ట్ ఉంది. ఈ విపత్కర పరిస్థితుల్లో ఎడతెరిపి లేని వర్షానికి, చల్లని గాలులకు, ఉరుములు మెరుపులకు పాఠశాల పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొన్నది. ఈ కారణాలతో పిల్లల తల్లిదండ్రుల, విద్యార్థి సంఘాల ద్వారా రాష్ట్రంలోని గవర్నమెంట్, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వాలన్న డిమాండ్స్ వస్తున్నాయి. ఈ సందర్భంలో మేరకు తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. తెలంగాణలోని చాలా ప్రాంతాలు వరదు ముంపుకు గురయ్యాని నదులు, చెరువులు, వాగులు, వంకలు, తూములు, నాలాలు పొంగిపొర్లుతుండటంతో స్టూడెంట్స్.. స్కూల్స్, కాలేజీలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ముప్పు వాటిల్ల కుండా రెండు, మూడ్రోజులు హాలిడేస్ ఇవ్వాలని వేముల రామకృష్ణ కోరారు. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో ఇప్పటికే ఏపీలోని పలు జిల్లాల్లో కలెక్టర్లు స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. మరో మూడ్రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెదర్ డిపార్ట్‌మెంట్ తెలిపింది. ఉరుములు, మెరుపులతో పాటు భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కొన్ని ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశం ఉందని పౌరులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇక హైదరాబాద్‌లోనూ మధ్యాహ్నం సమయంలో వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. సిటీలో డ్రైనేజీలు పొంగి పొర్లుతున్న నేపథ్యంలో ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలి. తెలియని దారుల్లో వెళ్లకపోడమే మంచింది. పలు చోట్ల కరెంట్ షాక్ ఘటనలు కూడా నమోదవుతున్న నేపథ్యంలో అప్రమత్తత అవసరం.

## ప్రభుత్వంపై కెసిఆర్ విమర్శలకు ఎద్దేవా చేసిన మంత్రి కోమటిరెడ్డి





**మొదటి పేజీ తరువాయి**

ఫ్యామిలీకి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎద్దేవా చేస్తూ హితవు పలికారు. గజ్వేల్, సిరిసిల్లలో ఓడిపోయిన వాళ్లు రాష్ట్రంలో దుకాణం బంద్ చేసుకుంటే మంచిదని ఎద్దేవా చేశారు. నల్గొండలో మీడియాతో మంత్రి మాట్లాడారు. కాళేశ్వరం పేరుతో రూ.2 లక్షల కోట్ల అప్పుతెచ్చి నాసిరకం ప్రాజెక్టు కట్టారని కేసీఆర్ పై ఆయన ఫైర్ అయ్యారు. గోదావరి వరదకు బ్యారేజీ బీటలు బారుతోందని విమర్శించారు. ఆగస్టు నాటికి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. నిరుడు రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, ఈసారి అలాంటి పరిస్థితులు రావొద్దని దేవుడిని కోరుకున్నానని మంత్రి తెలిపారు. హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిని ఆరు లేన్లుగా విస్తరించే పనులను సెప్టెంబరులో ప్రారంభిస్తామని చెప్పారు. ఇందుకు ఆగస్టులో టెండర్లు పిలుస్తామని, ఈ విషయమై సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మ–రోసారి భేటీ అవుతానని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తామని, త్వరలో కేబినెట్‌లో దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

## వికలాంగులపై స్మితా సబర్వాల్ ఐఏఎస్ అనుచిత వ్యాఖ్యలు

**మొదటి పేజీ తరువాయి**

ఆవిడ మాటలా అని సివిల్స్ ఎగ్జామ్ కోచ్ బాల లత ప్రశ్నించారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో వికలాంగులు ఉండాలా వద్దా చెప్పండి. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక మొదటి ఉద్యోగం దివ్యాంగురాలికి ఇచ్చారు. స్మిత వ్యాఖలకి సీఎం స్పందించి చర్యలు తీసుకోవాలి. ప్రతిపక్ష నేత కేసీఆర్, కేటీఆర్ కూడా తక్షణమే స్పందించాలని అన్నారు. మా మీద ఏ అధికారంతో ఈ వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాతో వేలమంది విద్యార్థులు చర్చించారు. ఈ విషయాన్ని కచ్చితంగా ఖండించాలి. స్మిత సబర్వాల్ వెంటనే రిజైన్ చేయాలి. మాకు న్యాయం జరగాలని ఆమె డిమాండ్ చేశారు. స్మిత సబర్వాల్ జస్ట్ ఒక ఐఏఎస్. 24 గంటలు అయింది ఆమె ఈ వ్యాఖ్యలు గురించి మాట్లాడి. ఇప్పటికీ వ్యాఖలను ఆమె వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పలేదు. ఇదే నా ఓపెన్ ఛాలెంజ్ ఇద్దరికీ (నాకు, స్మితకి) సివిల్స్ ఎగ్జామ్స్ పెట్టండి ఎవరికి ఎక్కువ మార్క్స్ వస్తాయో చూద్దాం అంటూ బాల లత అన్నారు. స్మితా సబర్వాల్ ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళి కింద నిబంధనల ఉల్లంఘనకు పాల్పడ్డారు. రిజర్వేషన్లు కల్పిస్తున్న రాజ్యాంగాన్ని, సుప్రీంకోర్టు తీర్పులను ఈమె వ్యతిరేకిస్తున్నారా.. ప్రీమియర్ సర్వీసెస్ అనగా ఈమె ఉద్దేశ్యంలో ఏమిటి? ప్రజాసేవకులా, ప్రజల మీద పెత్తనం చేయువారా అంటూ బాల లత ప్రశ్నించారు. దివ్యాంగులు ఎక్కువ సేపు పనిచేయలేరని, వారి సమర్థతను నిర్ణయించడానికి, శంఖించడానికి స్మిత సబర్వాల్ కు గల శాస్త్రీయ ప్రాతిపదికలు ఏమిటని లత ప్రశ్నించారు. దివ్యాంగుల పట్ల సానుభూతి లేని స్మిత వాఖ్యలను దివ్యాంగ సమాజం తీవ్రంగా ఖండిస్తుందని, ఆమె బహిరంగ క్షమాపణలు చెప్పాలని లత డిమాండ్ చేశారు. సర్టిఫికేట్ ఇచ్చిన డాక్టర్ దివ్యాంగుడు కాదు. వెరిఫై చేసిన డాక్టర్లు దివ్యాంగులు కారు. ఉద్యోంగ ఇచ్చిన అథారిటీ దివ్యాంగులు కాదు. అటువంటప్పుడు దివ్యాంగులను ఏ విధంగా కించపరిచినట్లు ప్రవర్తిస్తారు. సమాజం మొత్తం దీని గురించి ఆలోచించాలని లత అన్నారు.

## వచ్చే ఐదేళ్లలో ఆర్టీసీలో భారీ స్థాయిలో ఖాళీలకు అవకాశం

**మొదటి పేజీ తరువాయి**

2,325 ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ ఏడాది 2,196, వచ్చే సంవత్సరంలో 1,859, 2026లో 2,001, 2027లో 1,927 మంది ఉద్యోగ విరమణ పొందనున్నట్లు తెలిసింది. ఇలా 2029 వరకు పది వేల మందికి పైగా పదవీ విరమణ చేయనున్నట్లు ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. మరోవైపు ఎమ్మెల్యేలు, ఎంపీల వినతుల మేరకు గ్రామాలకు అదనపు బస్సులు నడపాలని రవాణాశాఖ సూచించడంతో అదనపు ఉద్యోగులు అవసరం అవుతారు. ఆర్టీసీలో 3,035 ఉద్యోగాల భర్తీకి ప్రతిపాదనలు పంపగా, ప్రభుత్వం 3 వారాల క్రితమే ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్ విషయంలో ప్రభుత్వం స్పష్టంగా ఉందని ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేయాలో పరిశీలించి ప్రతిపాదనలు పంపాలని ఆర్టీసీ అధికారులకు సూచించినట్లు సమాచారం.

## రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు విస్తారంగా వర్షాలు

### వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ

### అప్రమత్తమైన సీఎస్.. కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష సమావేశం



హైదరాబాద్, జులై 22 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో గత వారం రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో గోదావరి నదితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ వరదలు సంభవించిన విషయం తెలిసిందే. అయితే రాష్ట్రంలో మరో మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో అప్రమత్తమైన సీఎస్ శాంతి కుమారి కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి మరో మూడు రోజుల పాటు వర్ష సూచనలు ఉండటంతో అందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని, ముంపు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే వరదలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చెరువులు, కుంటలు తెగకుండా ముందు జాగ్రత్తలు తీసుకుకొవాలన్నారు. భారీగా వరదలు సంభవిస్తున్న క్రమంలో భద్రాద్రి, ములుగు జిల్లాలో ఎన్డీఆర్ఎఫ్ బృందాల మోహరింపుతో పాటు జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు, ఎస్పీలకు సీఎస్ శాంతికుమారి దిశా నిర్దేశం చేశారు.

## కొత్తగా పట్టా పాసబుక్ వచ్చిన "రైతు"లకు భీమాకు అవకాశం

**మొదటి పేజీ తరువాయి**

తెలియజేశింది. భూముల క్రయవిక్రయాలు, ఇతర రూపాల్లో చేతులు మారిన రైతుల భూములకు సంబందించి జూన్ 28వ తేదీ లోగా పట్టా పాస్ పుస్తకాలు వచ్చిన రైతులతో పాటు గతంలో రైతు భీమాకు దరఖాస్తు చేయని రైతులు కూడా కొత్తగా రైతుభీమాకు ధరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే రైతు భీమాలో మార్పులు చేర్పులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. రైతు భీమాలో ఆధార్ నామిని చనిపోయినా నామినిలో మార్పులు చేర్పులు చేయాల్సి ఉన్నా ఈ తరహా దరఖాస్తులకు జూలై 30వ తేదీని తుది గడువుగా నిర్ణయించింది. ఈ మేరకు మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇందులో 1965 ఆగస్ట్ 14 నుంచి 2006 ఆగస్ట్ మధ్యలో పుట్టిన రైతులు కొత్త దరఖాస్తుకు అర్హులుగా పేర్కొంది. దీని ప్రకారం ఆధార్ కార్డులో 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సు గల రైతులు మాత్రమే కొత్తగా రైతు భీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. ఈ దరఖాస్తులకు ఫారంలో పొందుపరిచిన అంశాలు నింపి, దానితో పాటు భూమి పాస్ బుక్, తహసీల్దారు డిజిటర్ సంతకం, డీఎస్ పేపర్ సహా రైతు ఆధార్ కార్డ్, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ పత్రులు జత చేసి, రైతు స్వయంగా ఏఈఓలకు సమర్పించాలని అధికారులు తెలిపారు. ఈ పథకం కింద ఏ కారణం చేతనైనా రైతు చనిపోతే బాధిత కుటుంబానికి 5 లక్షల రూపాయల భీమాను ప్రభుత్వం అందజేస్తుంది. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త పథకాలతో పాటు గత ప్రభుత్వ పథకాలను కూడా కంటిన్యూ చేస్తోంది. ఈ నేపథ్యలోనే రైతు భీమాకు మరో సారి అవకాశం కల్పించింది. దీంతో మరి కొంతమంది రైతులకు లబ్ది చేకూరనుంది.

## రహదారుల మరమ్మతులుపై దృష్టి సారించిన రోడ్లు, భవనాలశాఖ

**మొదటి పేజీ తరువాయి**

అంశాలపై కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. రహదారులపై గుంతల గుర్తింపు, వాటి మరమ్మత్తులకు సంబంధించి ఇప్పటికే కర్ణాటక ప్రభుత్వం ఒక యాప్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. ఈ క్రమంలో ఆ యాప్ ఎలా పనిచేస్తుంది, అమలు విధానం ఎలా ఉంది.. వంటి అంశాలపై అధ్యయనం చేసేందుకు శాఖ నుంచి అధికారుల బృందాన్ని ఆ రాష్ట్రానికి పంపాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. రోడ్లపై గుంతలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ఆ ప్రమాదాల్లో మరణిస్తున్నవారికి పరిహారం సరిగా అందడంలేదని, రహదారి భద్రతపై సుప్రీంకోర్టు ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని ఇటీవల హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు రోడ్లపై గుంతల సమస్య పరిష్కారానికి ఓ యాప్‌ను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ యాప్ విధానం ఇప్పటికే కర్ణాటకలో అమలవుతోందని వెల్లడించింది. ఈ క్రమంలోనే అప్రమత్తమైన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ సమస్య పరిష్కారానికి యాప్‌ను తీసుకువచ్చే పనిలో నిమగ్నమైంది. ఇదే విషయాన్ని త్వరలోనే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితోపాటు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిసింది.

**ఫొటో తీసి ఆప్ లో పెడితే చాలు.**

కర్ణాటక ప్రభుత్వం ఒక యాప్‌ను తీసుకొచ్చింది. గుంత ఉన్న ప్రదేశాన్ని ఫొటో తీసి అందులో అప్‌లోడ్ చేస్తే సంబంధిత శాఖ మరమ్మతుకు చర్యలు తీసుకుంటుంది. ఒక వేళ ఆ పనులు ఆలస్యమైతే కారణాలను పొందుపర్చేలా యాప్‌ను రూపొందించారు. ఈ క్రమంలో రాష్ట్రంలోనూ మరింత పకడ్బందీగా యాప్‌ను రూపొందించాలని ఆర్అండ్‌బీ అధికారులు నిర్ణయించారు. గుంత ఉన్న ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేయగానే గుంత ఉన్న ప్రాంతం, అది ఏ అధికారి పరిధిలోకి వస్తుంది, ఆ రహదారి పూర్తి వివరాలు వెంటనే డిస్‌ప్లే అయ్యేలా యాప్ ను రూపొందించనున్నారు. గూగుల్ మ్యాప్ ఆధారంగా యాప్‌ను తీర్చిదిద్దనున్నారు. పనులు పూర్తయ్యాక సదరు కాంట్రాక్టర్లు బిల్లుల కోసం తిరిగే పని లేకుండా యాప్‌లో వివరాలు పొందుపర్చగానే చెల్లించేందుకు వీలవుతుందా? లేదా? అని కసరత్తు చేస్తున్నారు.

**తొలుత జీహెచ్ఎంసీలో**

యాప్‌ను తొలుత జీహెచ్ఎంసీ పరిధిలో అమలు చేయాలని అధికారులు సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఇక్కడ వచ్చే ఫలితాలను బట్టి రాష్ట్రంలోని మునిసిపాలిటీలు, ఆర్ అండ్ బీ రోడ్ల పరిధిలో అందుబాటులోకి తీసుకురానున్నట్టు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలో 28,278 కి.మీ. మేర రోడ్లు ఉన్నాయి. ఇవి కాక పంచాయతీ రాజ్ శాఖ పరిధిలోనూ ఉన్నాయి. ఈ యాప్‌ను రోడ్లు, భవనాల శాఖ పరిధిలోనే అమలు చేస్తారా.. లేదా అన్ని రోడ్లను అందులో నమోదు చేసి శాఖల వారీగా విభజిస్తుందా.. అన్నది తెలియాల్సి ఉంది.

## ఉద్యమకారుల స్మృతివనానికి వంద ఎకరాలు కేటాయించాలి

**మొదటి పేజీ తరువాయి**

రాశారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌తో కలిసి ఈ నెల 23న పార్లమెంట్‌లో మోదీకి లెటర్లను అందజేయనున్నట్టు ఉద్యమకారుల సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిషన్ రావు, సుదర్శన్ రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతేడాది రాష్ట్ర పర్యటనకు వచ్చిన రాజ్‌నాథ్ సింగ్, ప్రకాశ్ జవదేకర్, జేపీ నడ్డా స్మృతి వనం ఏర్పాటుకు హామీ ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి 250 గజాల జాగా, నెలకు రూ.25వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలోనూ ఈ హామీ ఉందని గుర్తు చేశారు. 1969 ఉద్యమకారులు 300 మందిలోపే ఉన్నారని తెలిపారు.

## ఆరోగ్యశ్రీ చికిత్స ధరలను సవరించిన సర్కార్

హైదరాబాద్, జులై 22 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ చికిత్సకు సంబంధించిన ధరలను సవరించింది. 1,375 ప్యాకేజీల ధరలను సవరిస్తూ జీవో 30ని జారీ చేసింది. మిగిలిన 297 ప్యాకేజీ ధరల్లో మార్పు లేదని ప్రభుత్వం జీవోలో స్పష్టం చేసింది. అదే సమయంలో కొత్తగా 163 చికిత్సలను చేరుస్తూ నిర్ణయం తీసుకున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సగటున 20 నుంచి 20శాతం రేట్లు పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆరోగ్యశ్రీలో కొత్తగా తీసుకున్న నిర్ణయాలతో ప్రభుత్వంపై రూ.438 కోట్ల భారం పడుతుందన్నారు. ఆరోగ్యశ్రీకి సంబంధించి అదనపు ఖర్చు రూ.600 కోట్లు పెరిగిందన్నారు. ట్రస్ట్ ద్వారా దాదాపు 6 లక్షల మందికి బాసటగా ఉందన్నారు. కొత్త ప్రొసీజర్స్‌తో మరో లక్షన్నర కుటుంబాలను ఆదుకోబోతుందన్నారు. 79లక్షల కుటుంబాలకు ఆరోగ్యపరంగా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఇదిలా ఉండగా ఆరోగ్యశ్రీ పేదలకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను అందించే పథకాన్ని తీసుకువచ్చిన విషయం తెలిసిందే.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# మూడోతరం నేతలు.....

తమిళనాడులో దివంగత నేత ఎం కరుణానిధి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తన అనంతరం వారసుడు ఎవరు అన్నదీ పెద్ద ఎత్తున చర్చ నడిచింది. చర్చ అనడం కన్నా అదో పెద్ద వివాదం అని చెప్పొచ్చు..! అప్పటికే డీఎంకే యువజన విభాగం అధ్యక్షుడిగా ఉన్న స్టాలిన్, తన వారసుడు అంటూ కరుణానిధి స్వయంగా ప్రకటించారు. పెద్ద కుమారుడైన అలగిరి కరుణానిధి వారసత్వం కోసం తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కరుణానిధి సీఎంగా ఉన్నప్పుడే వారసుడిగా తన అనంతరం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వ్యూహాత్మకంగా 2009 లోక్‌సభ ఎన్నికల అనంతరం డిప్యూటీ సీఎంగా స్టాలిన్‌ను ఎంపిక చేశారు.కరుణానిధి ఆరోగ్యం కూడా పూర్తిగా సహకరించకపోవడం అటు పార్టీ ఇటు ప్రభుత్వం రెండు విధాలుగా చేదోడు వాదోడుగా ఉంటాడన్న వ్యూహంతో ఆ రోజు కరుణానిధి ఆ నిర్ణయం తీసుకున్నారు. కరుణానిధి మరణానంతరం స్టాలిన్‌కు పార్టీ పగ్గాలు చేజిక్కించుకునేందుకు సీఎం అయ్యేందుకు ఆ రోజు కరుణానిధి నిర్ణయం ఎంతగానో దోహదపడింది. ప్రస్తుతం స్టాలిన్ కూడా అదే ఆలోచనతో తన కుమారుడు ఉదయినిధి స్టాలిన్‌కు వారసత్వం అందాలన్న వ్యూహంతో ముందుకు వెళుతున్నట్టు తెలుస్తోంది.ఇప్పటికే ఉదయనిధికి మంత్రివర్గంలో చోటు కల్పించిన స్టాలిన్, ఏకంగా డిప్యూటీ సీఎం చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఉదయనిధి స్టాలిన్ రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నారు. ప్రస్తుతం సీఎంగా ఉన్న స్టాలిన్ ఆరోగ్యపరంగా కూడా చిన్న చిన్న సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించాలంటే మంత్రిగా కంటే ఉపముఖ్యమంత్రిగా ఉండడం మంచిదన్న ఆలోచనతో స్టాలిన్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోందిఅలాగే 2026 లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు కూడా డీఎంకేకు ప్రతిష్టాత్మకం రానున్నాయి. తమిళనాడులో డీఎంకే ఏఐడీఎంకే ప్రధాన పార్టీలుగా ఉండగా వచ్చే ఎన్నికల్లో ప్రముఖ నటుడు విజయ్ స్థాపించిన పార్టీ కూడా బరిలో ఉండబోతోంది. దాంతో పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలంటే స్టాలిన్ తోపాటు తన అనుకున్న ముఖ్యమైన వారు పార్టీ బాధ్యతలను షేర్ చేసుకోవాల్సిన అవసరం ఉంది. 2009లో లోక్‌సభ ఎన్నికలు పూర్తైన వెంటనే అప్పట్లో ఎమ్‌కే స్టాలిన్ డిప్యూటీ సీఎం అయ్యారు. ఆ తరవాత సీఎం అయ్యారు. ఇదే సెంటిమెంట్‌ని ఫాలో అవుతూ ఇప్పుడు ఉదయనిధి స్టాలిన్‌ని డిప్యూటీ సీఎం కుర్చీలో కూర్చోబెట్టనున్నారు.చెపాక్ తిరువల్లికెని నియోజకవర్గం నుంచి ఓటంగా గెలుపొందిన ఉదయనిధి స్టాలిన్ 2022 డిసెంబర్‌లో కేబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నిజానికి ఇప్పటికే ఆయనకు ఈ పదవి దక్కాల్సింది. కానీ కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం వల్ల పొలిటికల్‌గా కాస్త ఇబ్బందులు ఎదురయ్యాయి. అలాంటి సమయంలో పదవి ఇస్తే తప్పుడు సంకేతాలు వెళ్తాయన్న ఉద్దేశంతో హైకమాండ్ ఆ నిర్ణయాన్ని వాయిదా వేసింది. ఇప్పుడు అంతా క్లియర్ కావడం వల్ల ఉప ముఖ్యమంత్రిని చేయాలని పట్టుదలతో ఉన్నారు ఎమ్‌కే స్టాలిన్. ఈ ఏడాది జనవరిలో ఉదయ నిధి స్టాలిన్ పెద్ద వివాదంలో ఇరుక్కున్నారు. సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మం డెంగీ, మలేరియా లాంటిదని అలాంటి వ్యాధుల్ని అంతం చేయాలని నోరు జారారు. కులం పేరుతో వివక్ష ఎందుకని ప్రశ్నిస్తూ ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ కామెంట్స్ సంచలనం సృష్టించాయి. ఈ వివాదం కోర్టుల వరకూ వెళ్లింది. ఉదయనిధి స్టాలిన్‌ని కోర్టులు మందలించాయి కూడా. సుప్రీంకోర్టు కూడా కలగజేసుకోవాల్సి వచ్చింది. ఇదంతా సద్దుమణిగింది అనుకునేలోగా ప్రభుత్వానికి మరో షాక్ తగిలింది. కల్లకురిచ్చి జిల్లాలో కల్తీ మద్యం కలకలం రేపింది. కల్తీ మద్యం సేవించి దాదాపు 65 మంది ప్రాణాలు కోల్పోయారు.లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే ఈ ఘటన జరగడం ప్రభుత్వానికి సవాల్ విసిరింది. అప్పటికప్పుడు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకున్నప్పటికీ రావాల్సిన చెడ్డ పేరు వచ్చింది. అయితే...ఉదయనిధి స్టాలిన్‌ని డిప్యూటీ సీఎం చేసే విషయంలో ఎమ్‌కే స్టాలిన్‌దే తుది నిర్ణయమని పార్టీలోని కీలక నేతలు స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ నిత్యం విమర్శలు గుప్పిస్తుంటారు ఉదయనిధి స్టాలిన్. లోక్‌సభ ఎన్నికల్లో గట్టిగా ప్రచారం చేశారు. పార్టీ మెజార్టీ సీట్లు గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించారు. మదురైలో ఎయిమ్స్ ప్రాజెక్ట్ ఇస్తామని చెప్పి కేంద్రం మోసం చేసిందంటూ చేసిన ప్రచారం బాగానే కలిసొచ్చింది. ప్రస్తుతానికి పార్టీని ముందుండి నడిపించే సత్తా ఉదయనిధికి ఉందని సీఎం భావిస్తున్నారు అందుకోసమే వీలైనంత త్వరగా డిప్యూటీ సీఎం చేయడం, ఇటు పార్టీకి ప్రభుత్వంలో అభివృద్ధి కార్యక్రమాలకు సులువుగా ఉంటుందని స్టాలిన్ యోచిస్తున్నట్టు తెలుస్తోంది.మరోవైపు గతంలో తండ్రి కరుణానిధి సీఎంగా ఉన్నప్పుడే డిప్యూటీ సీఎం అయ్యాక పార్టీలో స్టాలిన్ మంచి పట్టు సాధించగలిగారు. ఇప్పుడు తన కుమారుడు ఉదయినిధి స్టాలిన్‌కు కూడా అదే ఫార్ములా ఉపయోగపడుతుందని గట్టిగా భావిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. అయితే ఈ విషయం అధికారికంగా ప్రకటన రానప్పటికీ డీఎంకేలో కీలక నేతల ద్వారా అందిన సమాచారం మేరకు వీలైనంత త్వరగా స్టాలిన్ తన నిర్ణయాన్ని అమలు చేయనున్నట్టు తెలుస్తోంది.

# విద్యుత్తు సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

## ఎమ్మెల్యే మేఘారెడ్డి



వనపర్తి నియోజకవర్గ ప్రతినిధి, జూలై 22 (తీన్మార్ న్యూస్): వనపర్తి నియోజకవర్గ పరిధిలోని విద్యుత్ సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టిని సారించి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. సోమవారం వనపర్తి డిఈ కార్యాలయంలో ఆయన అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వనపర్తి నియోజకవర్గంలో విద్యుత్ పరమైన సమస్యల పరిష్కారానికి కొత్తగా ఏర్పాటు చేయవలసిన విద్యుత్ ఉప కేంద్రాలు, నియంత్రికలు, విద్యుత్తు లైన్ల ఏర్పాటుకు సంబంధించిన వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అధికారులు అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరాను అందించాలని, నియంత్రికల వద్ద వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని ఆయన వారికి సూచించారు. కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, మాజీ జెడ్పిటిసి గొల్ల వెంకటయ్య, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, సత్య శీలా రెడ్డి వనపర్తి అసెంబ్లీ సమన్వయకర్త లక్కాకుల సతీష్, కొత్తకోట ఏడి శివశంకర్ రెడ్డి, వనపర్తి ఏడి వేణు, వనపర్తి ఏడి రాజయ్య గౌడ్, ఖిల్లా ఘనపురం ఏఈ కొండయ్య, వనపర్తి మండల ఏఈ శ్రీనివాసులు,పెద్దమందడి మండల ఏఈ శ్రీకాంత్, గోపాల్పేట ఏఈ, హర్షవర్ధన్ రెడ్డి, పెబ్బేరు ఏఈ అభిలాష్, శ్రీరంగపురం ఏఈ సుఖేష్, పాల్గొన్నారు.

# ఖబరస్తాన్ ను పరిశీలించిన అధికారులు

## సమాధులను ధ్వంసం చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్



ఆత్మకూర్, జులై 22 (తీన్మార్ న్యూస్): ఆత్మకూర్ మున్సిపాలిటీ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని సర్వే నంబర్లు ఒకటి, రెండు, 517లో రెండు ఎకరాల రెండు గుంటలలో ఉన్న అతి పురాతనమైన కబరస్థాన్ లో సమాధులను ధ్వంసం చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ముస్లిం మత పెద్దలు, యువకులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ సందర్భంగా ఆత్మకూరు తహసిల్దార్ రాజు, ఎస్ ఐ నరేందర్, మునిసిపాలిటీ చైర్మెన్ గాయత్రి రవి కుమార్ యాదవ్, పురపాలిక వార్డుల అధికారులు ఖాభారస్థాన్ లోని ధ్వంసమైన సమాధులను పరిశీలించారు. వారం రోజుల్లోగా పూర్తిస్థాయిలో ముళ్లపదలను తొలగించి పకడ్బందీగా సర్వేలను నిర్వహిస్తామని అధికారులు వెల్లడించారు. సమాధులు ధ్వంసం విషయమై ఇదివరకే కేసు నమోదు అయ్యిందని విచారణ చేపడుతున్నామని త్వరలోనే దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు అన్నారు. కేవలం ఒకే ఒక్క వ్యక్తి స్వార్థం కోసం సమాధులను ధ్వంసం చేసి రోడ్డును నిర్మించుకోవాలని ప్రయత్నిస్తున్నారని, ఈ విషయమై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునారావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని ముస్లిం సోదరులు డిమాండ్ చేశారు.

# మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

## రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క)



వాజేడు, జులై 22 (తీన్మార్ న్యూస్): మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, వారికి కావాల్సిన ప్రోత్సాహకాలు ప్రభుత్వం అందిస్తుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. సోమవారం వాజేడు మండలం, చీకుపల్లి గ్రామం లోని బొగత వాటర్ ఫాల్స్ లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా శక్తి క్యాంటీన్ లలో ఆహారం అమ్మ చేతి వంటల ఉండాలని , నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. మహిళా శక్తి క్యాంటీన్లు దేశానికే ఒక బ్రాండ్ గా నిలవాలని , స్థానిక వనరులు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మహిళా శక్తి బిజినెస్ మోడల్స్ ను త్వరలోనే రూపొందిస్తామని , రానున్న ఐదు సంవత్సరాలలో మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు అందించడంతో పాటు మీసేవ, పౌల్ట్రీ, డైరీ వ్యాపారాలు, క్యాంటీన్ల ఏర్పాటు కు అన్ని రకాల ప్రోత్సాహకాలు ప్రభుత్వం అందించడంతోపాటు వడ్డీ లేని రుణ సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. రాష్ట్రంలో ఉన్నా మహిళలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో బ్యాంక్ లీకేజీ ద్వారా అందించడం జరుగుతుందని, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ లను ప్రారంభించడం జరుగుతుందని నూతనమైన ఆహార పదార్ధాలతో క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే మహిళలు మి సేవ కేంద్రాలు, ఈవెంట్ మేనేజ్మెంట్, డైరీ ఫాంలు, సోలార్ లైట్స్, అదేవిధంగా పాఠశాలల్లో ఏక రూప దుస్తులను మహిళా సంఘాల ద్వారా కుట్టించామని పేర్కొన్నారు. అనంతరం బొగత జలపాతం ను సందర్శించి వరద ప్రవాహాన్ని పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి. శ్రీజ, ఓ ఎస్ డి మహేష్ బాబా గీతే, డి ఎఫ్ ఓ రాహుల్ కిషన్ జాదవ్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్ కుమార్, డి డబ్లూ ఓ స్వర్ణ లత లెనినా, మహిళ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# అందరి ఎమ్మెల్యేల కంటే ఎమ్మెల్యే మేఘ రెడ్డి ఆదర్శం



వనపర్తి నియోజకవర్గ ప్రతినిధి, జూన్ 22 (తీన్మార్ న్యూస్): పేద ప్రజల కోసం పుట్టిన నాయకుడు ఎవరైనా ఉన్నారంటే, ఆయనే మన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఎన్నో సంవత్సరాలుగా ఆయన సంపాదనలో పేద ప్రజల కోసమై ఎన్నో విధాల ఖర్చు పెడుతున్న వ్యక్తి కేవలం మన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి. అదేవిధంగా నిరుపేదలు మృతి చెందిన వారికి తన వంతు సహాయం చేస్తున్న వ్యక్తి మన వనపర్తి ఎమ్మెల్యే తుడిమెగా రెడ్డి. దానిలో భాగంగా రెండు రోజుల క్రితం పెద్దమందడి గ్రామంలో మాల కృష్ణమ్మ మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి, ఆ మృతురాలి దశదినకర్మల కోసమై రూ,5000 లను ఈరోజు పెద్దమందడి కాంగ్రెస్ కార్యకర్తల ద్వారా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొమ్ము వెంకటస్వామి, మాజీ సర్పంచ్ వెంకటస్వామి, మరియు మాజి స్కూల్ చైర్మన్ సూర్య రవి, మరియు మాజీ ఎంపీటీసీ బుచ్చన్న, వార్డ్ నెంబర్లు రామాంజనేయులు, మరియు సింగల్ విండో డైరెక్టర్ నరేష్ కుమార్, పుల్లన్న యాదవ్, నందిమల్ల కురుమన్న, వూషన్నయాదవ్, టిఎంఆర్ నాయకులు ఎస్.రాఘవేందర్, గట్టు రాజశేఖర్, బోయ స్వామి, దర్శన్, నీలంరవి, సాయిబాబు, హనుమంతు, కేశవులు, కృష్ణయ్య మరియు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని వారి ద్వారా ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఆర్థిక సహాయాన్ని అందుకున్న కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే టి.మేగారెడ్డికి ధన్యవాదాలు తెలియచేశారు.

# ఫిషింగ్ ఈమెయిల్స్,అనుమానస్పద లింకులపై క్లిక్ లు చేయకూడదు

న్యూఢిల్లీ : మైక్రోసాఫ్ట్ ఔటేజ్ కారణంగా హ్యాకర్లు అడ్వాంటేజ్ తీసుకునే ప్రయత్నం చేస్తారని అమెరికా సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ సిఐఎస్ఏ హెచ్చరించింది. మైక్రోసాఫ్ట్ సిస్టం ను తిరిగి సురక్షితం చేసేందుకు తీవ్రంగా పనిచేస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ చైర్మన్, సిఈవో సత్యా నాదెళ్ల అన్నారు.ఫిషింగ్ ఈమెయిల్స్ లేక అనుమానస్పద లింకులపై క్లిక్ లు చేయకూడదని యూఎస్ సైబర్ సెక్యూరిటీ హెచ్చిరించింది. ఆయా సంస్థలు తమ వినియోగదారుల ఆస్తులు, డేటాను కాపాడే చర్యలు చేపట్టాలని కూడా హెచ్చరించింది." ఔటేజ్ విండోస్ 10, తదనంతర సిస్టంలను ప్రభావితం చేసింది. క్రౌడ్ స్ట్రయిక్ ఫాల్కన్ కంటెంట్ అప్డేట్ కారణంగానే ఈ ఔటేజ్ సంభవించింది తప్ప, హానికరమైన సైబర్ కార్యకలాపాల వల్ల కాదు" అని నాదెళ్ల 'ఎక్స్' పోస్ట్ లో తెలిపారు. " మేము ఈ సమస్యను గుర్తించాము. క్రౌడ్ స్ట్రయిక్ తో, ఐటి పరిశ్రమ తో కలిసి పనిచేస్తున్నాము. కస్టమర్లకు సాంకేతిక మార్గదర్శకత్వం, మద్దతు ఇచ్చి సిస్టమ్స్ లను మళ్లీ సురక్షితం గావించేందుకు కృషి చేస్తున్నాము" అని ఆయన తెలిపారు.

# తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం




ఆర్మూర్ : పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం బీజేపీ ఓబిసి ఆధ్వర్యంలో నిరసన తెలిపినారు ఈ సందర్భంగా ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ హామీని నెరవేర్చాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యామాద్రి భాస్కర్, పట్టణ అధ్యక్షుడు రాజ్ కుమార్ లు డిమాండ్ చేశారు. బీసీ డిక్లరేషన్ హామీని అమలు చేయాలని, బీసీలకు న్యాయం చేయాలని కోరినారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు వినతి పత్రం అందజేసినారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జెస్సు అనిల్ కుమార్, పెర్కిట్ దుగ్గి విజయ్, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మద్నూర్ లో భారీ వర్షం.. 64.2 మీమీ నమోదు

మద్నూర్: మద్నూర్ మండలంలో భారీ వర్షం కురిసింది రెవెన్యూ అధికారుల నివేదికల ప్రకారం 64.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. మండలంలో అల్పపీడన ప్రభావం మూలంగా వర్షాలు భారీగా పడడం ఇక్కడి పంటలకు ఇలాగే వర్షాలు మరింతగా కురిస్తే వానాకాలం పంట సాగు పంటలకు భారీగా నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నట్లు వ్యవసాయ రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. ఇక్కడి పంటల సాగుకు సాధారణ వర్షాలే అవసరం. వర్షాకాలం అతివృష్టిగా కురిసినా.. అనావృష్టిగా ఏర్పడిన పంటల దిగుబడులకు నష్టమే వాటిల్లుతుందని వ్యవసాయదారులు ఆవేదన వ్యక్తం అవుతుంది. ఎందుకంటే ఇక్కడ సాగు భూములకు ఎలాంటి సాగునీటి సౌకర్యాలు లేవు. వర్షాధారం పైనే ఆధారపడి పంటలు పండిస్తారు. వర్షాకాలం అధికంగా పడిన అనావృష్టిగా ఏర్పడిన పంట దిగుబడులకు నష్టమే వాటిల్లుతుంది. సాధారణ వర్షాలే ఇక్కడ పంటల సాగుకు మంచి దిగుబడులు రావడానికి అనుకూలిస్తాయి. ఈ వారంలో వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయి. పంటలకు కావలసిన వర్షానికి అంటే అధికంగా పడటం మూలంగా పంటల రంగు మారే అవకాశం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడికే వర్షం ఆగిపోతే పంటలు బాగా పండే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# మేడ్చల్‌లో గుర్తుతెలియని మహిళ పుర్రె లభ్యం..



గుర్తు తెలియని మహిళ పుర్రె లభ్యమైన సంఘటన మేడ్చల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని అత్వెల్లి గ్రామంలోని నార్నే ఎస్టేట్లో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి పుర్రె, వెంట్రుకలు, చీర, బ్లౌజ్, చేతి సంచి, ఒక చెప్పు కనపడింది. దీంతో వెంటనే స్థానిక మేడ్చల్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మేడ్చల్ సీఐ అద్దాని సత్యనారాయణ, సబ్ ఇన్స్పెక్టర్ మురళీధర్ లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం నగరంలోని గాంధీ ఆస్పత్రి నుంచి ఫోరెన్సిక్ ప్రొఫెసర్ కె.వి నాగరాజుతో పాటు 5 మంది సిబ్బందితో కలిసి ఆధారాలు సేకరించారు. అనంతరం ఫోరెన్సిక్ ప్రొఫెసర్ కె.వి నాగరాజు మాట్లాడుతూ.. గత ఆరు నెలలకు ముందే ఈ హత్య జరిగి ఉండొచ్చని ఆయన తెలిపినట్లు ఎస్సై మురళీధర్ పేర్కొన్నారు. ఎవరైనా గుర్తిస్తే వెంటనే తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని సీఐ తెలిపారు.

# ప్రాణాలు పోతేగాని అధికారులు పట్టించుకోరా



గాంధారి: గాంధారి మండలం లోని పెద్ద పోతాం గల్ గ్రామ పంచాయతీ పరిధిలోని కర్ణంగడ్డ తండాలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో తండాకు వెళ్లే దారిలో వంతెన 90 శాతం కూలిపోవడం తో తండా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని తండా వసూలు కోరుతున్నారు. గత సంవత్సరం కాలంగా వంతెనకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకోలేదని, ప్రాణాలు పోతే గాని పట్టించు కోరా అని తండా వసూలు ఆరోపిస్తున్నారు.

# విద్యార్థులకు అన్యాయం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

**ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్ ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి విజయవంతం**




హన్మకొండ, జులై 22 (తీన్మార్ న్యూస్): సోమవారం రోజున ఏబిఎస్ ఎఫ్ జిల్లా కమిటీ పక్షాన జిల్లాలో ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని హన్మకొండ కలెక్టరేట్ ముట్టడి చేయడం జరిగింది. అనంతరం జిల్లా అధ్యక్షులు మంద నరేష్ మాట్లాడుతూ ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి గారు విద్యార్థి నిరుద్యోగులకు అండగా ఉంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థి నిరుద్యోగులు అందరు కలిసి కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఉండి గెలిపించడం జరిగింది తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అవ్వడం జరిగింది. ముఖ్యమంత్రి అయ్యాక రేవంత్ రెడ్డి పూర్తిగా విద్యార్థులకు నిరుద్యోగులకు అన్యాయం చేయడం జరిగిందని మంద నరేష్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు నిత్యవసర సరుకులు పెరిగినందున విద్యార్థులకు మెస్ బిల్లులు కాస్మోటిక్ చార్జీలు పెంచాలని అదేవిధంగా ప్రభుత్వ విద్య సంస్థలను బలోపేతం చేయాలని ప్రైవేట్ విద్యాసంస్థలు అక్రమ ఫీజులు దోపిడీ చేస్తున్నాయని పెండింగ్ స్కాలర్షిప్ లను ఫీజు రియంబర్స్మెంట్లు విడుదల చేయాలని ఎన్నోసార్లు ఉద్యమాలు చేసిన స్థానిక ఎమ్మెల్యేలు మంత్రులు రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించకపోవడము సిగ్గుచేటు అని అన్నారు. అదేవిధంగా కాకతీయ అదేవిధంగా కాకతీయ విశ్వవిద్యాలయంలో అనేక సమస్యలు ఉన్న ఏ రోజు కూడా మంత్రులు గాని ఎమ్మెల్యేలు గానీ యూనివర్సిటీని పర్యవేక్షణ చేయకపోవడం మరియు యూనివర్సిటీకి అధిక నిధులు కేటాయించకపోవడం బాధాకరం అని అన్నారు. యూనివర్సిటీ కి తక్షణమే 1000 కోట్ల నిధులు కేటాయించి టీచింగ్ మరియు నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అదేవిధంగా స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్ కి సొంత భవనాలు లేకపోవడంతో అద్దెభవనాల్లో ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారని వారికి సొంత భవనాలు నిర్మించి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మంద నరేష్ కోరారు ప్రభుత్వం స్పందించి విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే జిల్లాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబిఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోట్ల నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు దార సురేష్ కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జ్ మచ్చ పవన్ కళ్యాణ్, కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షులు దూడపాక నరేందర్, ఏబిఎస్ఎఫ్ నాయకులు కిరణ్, హర్షం చరణ్, బండారి పృథ్వీరాజ్, రత్నాకర్, సాయికుమార్, పవన్, పల్లవి, లావణ్య, సుబ్బులు, ప్రవళిక, జోష్నా, షబీనా, సుమలత, గోపి, మరియు తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# వ్యాపార కళను ఉత్తమంగా చూసే ధోరణి సరిగాదు

**– సుందరయ్య విజ్ఞాన కేంద్రం.. చైతన్య కేంద్రం : నందిని సిధారెడ్డి**

**– ప్రత్యామ్నాయ విలువలతో కూడిన సంస్కృతిని ముందుకు తీసుకెళ్లాలి : దాశరథి ఫిలిం సొసైటీ లఘుచిత్రాల పోటీల బహుమతుల ప్రదానోత్సవంలో నందిని సిధారెడ్డి**

**– సమాజాన్ని ఉన్నతీకరించే దిశగా అడుగులు పడటం శుభపరిణామం**

**– ఆకట్టుకున్న, ఆలోచింపజేసిన లఘు చిత్రాల ప్రదర్శన**

**– ఉత్తమ లఘుచిత్రంగా నిలిచిన 'అందరం ఓటేద్దాం'.**




హైదరాబాద్: వ్యాపార కళనే ఉత్తమ కళగా చూసే ధోరణి చెలామణి కావటం సమాజానికి శ్రేయస్కరం కాదని ప్రముఖ కవి నందిని సిధారెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో గల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దాశరథి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమంగా నిలిచిన పలు లఘుచిత్రాలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెక్నాలజీ ప్రజలకు ఉపయోగపడాలనీ, సంస్కరించే దిశగా, సమసమాజం వైపుగా నడిపించేలా ఉండాలని ఆకాంక్షించారు. కానీ, నేడు అది వెర్రితలలు వేస్తున్న దశను చూస్తున్నామని వాపోయారు. అది మనుషులను పతనం దిశగా నడుపిస్తున్న తీరుపట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కొమ్రంభీమ్, అల్లూరి సీతారామరాజులతో సంబంధం లేకుండా వారి పేర్లను వాడుకుని గొప్పతనాన్ని, జీవితాన్ని అవమానించి ప్రపంచ స్థాయి సినిమా తీయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో దాశరథి ఫిలిం సొసైటీ చేస్తున్న కృషిని అభినందించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఒక చైతన్య కేంద్రం అని ప్రముఖ కవి నందిని సిదారెడ్డి కొనియాడారు. ఎస్వీకే నుంచి సమాజాన్ని ఉన్నతీకరించే దిశగా అడుగులు పడుతుండటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మనుషులను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు ప్రతామ్నాయ విలువలతో కూడిన సంస్కృతిని రూపొందించడంలో ఎస్వీకే ముందువరుసలో ఉందన్నారు. దాశరథి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో సామాజిక అంశాలతో కూడిన లఘు చిత్రాలు ప్రదర్శిం చడం శుభపరిణామం అన్నారు. దాశరథి శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో ప్రజాకళను బతికించుకోవాలనే బలమైన ఆకాంక్షతో ఎస్వీకే మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రజాకళలు, ప్రజా చైతన్యం వర్ధిల్లాలని పిలుపునిచ్చారు. సీనియర్ టీవీ దర్శకులు పి.వి.చలం మాట్లాడుతూ.. దాశరథి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆయనపై నృత్యరూపకాన్ని, లఘుచిత్రాన్ని ఊరూరా ప్రదర్శించాలని సూచించారు. చైతన్యసారధి దాశరథి నృత్యరూపకం నవరసాలనూ పండించిందని కొనియాడారు. తెలంగాణ అధికార భాషా సంఘం మాజీ చైర్మెన్ మంత్రి శ్రీదేవి మాట్లాడుతూ..తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రను, అందులో పాలుపంచుకున్న మహనీయుల చరిత్రను బుర్ర కథల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరచాలని దాశరథి ఫిలిం సొసైటీకి సూచించారు. ఆ బృహత్ కార్యానికి తన వంతు సహకారం అందిస్తానని హామీనిచ్చారు. ఆత్మీయ అతిథులు సినీ నిర్మాత డాక్టర్ మూసా అలీఖాన్ మాట్లాడుతూ..సమాజానికి మంచి సందేశమిచ్చే అంశంతో లఘుచిత్రం తీయడానికి ముందుకొచ్చే వారికి సహకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. మెగా ఫౌండేషన్ నిర్వాహకులు లయన్ ఎం.నాగరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏడు వేల కోతులకు తన వంతుగా ఆహారాన్ని అందిస్తున్నానని చెప్పారు. విన్నో విద్యాసంస్థల చైర్మెన్ లయన్ డాక్టర్ జి.రవీందర్‌లు మాట్లాడుతూ..దాశరథి ఫిలిం సొసైటీ నిర్వహించే కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని ప్రకటించారు. దాశరథి ఫిలిం సొసైటీ అధ్యక్షులు ఎస్.వినయకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సొసైటీ కార్యదర్శి బీడీఎల్ సత్యనారాయణ, సభ్యులు జి.బుచ్చిరెడ్డి, సోమయ్య, న్యాయ నిర్ణేతలు భాస్కర చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల నేపథ్యంలో 4డివిజన్లో ఎమ్మెల్యే నాయిని విస్తృత పర్యటన

**అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలించిన ఎమ్మెల్యే**





హన్మకొండ, జులై 22 (తీన్మార్ న్యూస్): భారీ వర్షాల నేపథ్యంలో వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సోమవారం నాలుగవ డివిజన్ అక్షర కాలనీ లోటస్ కాలనీ మరియు జ్యోతి బస్సు నగర్ లో విస్తృతంగా పర్యటించారు. స్థానికంగా అభివృద్ధి కావలసిన పనులు మరియు పేరుకుపోయినటువంటి చెత్తాచెదారం పట్ల తీవ్రంగా అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్ దీపాలు వెలగడం లేదని తెలియజేయడంతో వెంటనే సంబంధిత అధికారికి ఫోన్ ద్వారా జరిగిన విషయాన్ని విన్నవించి త్వరగా తిను పూర్తి చేయాలని ఆదేశాలు జారి చేశారు. లోటస్ కాలనీ అక్షయ కాలనీలకు వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే పూర్తిస్థాయిలో అంతర్గత రోడ్ల నిర్మాణాలు జరుగుతాయని ఎమ్మెల్యే కాలనీవాసులకు తెలిపారు. అభివృద్ధి పరమైన సమస్యలు ఎన్ని ఉన్నా కూడా మళ్లీ వచ్చే వర్షాకాలం నాటికి పూర్తిస్థాయిలో అమలు చేసి మళ్లీ వస్తానని ప్రజల హామీ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల దృశ్యా నగరంలో ఉన్నటువంటి సమస్యల పట్ల క్షేత్ర స్థాయి నివేదికలు అందించాలని అధికారులను కోరారు. టాటా షో రూమ్ నుంచి జ్యోతి బసు కాలనీ మీదుగా ఉన్నటువంటి డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్న తరుణంలో తక్షణమే మున్సిపల్ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివారణ చర్యలు యుద్ధ ప్రధిపతికన చేయాలనీ ఆదేశించారు. వర్షాల కారణంగా నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల బెడద లెంకుండా నివారణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జ్యోతి బసు కాలనీ అంతర్గత రోడ్డు నిర్మాణం కోసం 15లక్షల ఎస్డిఎఫ్ నిధులను మంజూరు చేశారు. పెద్దమ్మగడ్డ పరిసర ప్రాంతాల్లో నగర మేయర్ తో కలిసి వర్షాల ద్వారా వచ్చే వరద ఉదృతిని పరిశీలించారు. పెద్దమ్మగడ్డ, పాలెం ఉన్నటువంటి ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రాంగణ మరమ్మత్తు కోసం తక్షణమే 15లక్షల నిధులను మంజూరు చేశారు.



# ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

**– ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**



జనగామ కలెక్టరేట్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తున్నందున నాణ్యమైన విద్య అందుతుందని, అందుకే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు రావాలని వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) తెలిపారు. జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, ఇతర నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి విస్తృతంగా పర్యటిం చారు. ఇందులో భాగంగా పలు గ్రామాల ప్రజల ఆహ్వానం మేరకు గతంలో వరదలకు కొట్టుకుపోయిన జనగామ మండలం చీటకోడూర్ వాగుపై నిర్మించిన లో-లెవల్ కల్వర్టును పరిశీలించారు. వాగుపై బ్రిడ్జి నిర్మాణం ఆవశ్యకత ఎంతో ఉందని ప్రజలు ఆయనకు విన్నవించారు. అనంతరం చౌడారం గ్రామానికి చేరుకొని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేశారు. గ్రామస్తుల కోరిక మేరకు పాఠశాలలో ఇటీవల మంజూరు చేసిన దాదాపు రూ. లక్ష బెంచీలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులకు ఎప్పుడు ఎలాంటి అవసరం ఉన్నా ప్రభుత్వంతో పాటు తన నుంచీ అవసరమైన మేరకు సహాయం అందిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని, పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు పాటుపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ అధ్యక్షులు శివరాజ్ యాదవ్, జనగామ పీఏసీఎస్ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, బ్రిడ్జి సాధన కమిటీ కన్వీనర్ వ్యాసారం కరుణాకర్, తీన్మార్ మల్లన్న టీం మౌనిక, గ్రామస్తులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు అఖిల భారత సర్వీస్లో రిజర్వేషన్లు అవసరం లేదా..!

**స్మితా సభర్వాల్ ఐఏఎస్ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి**

**20శాతం దివ్యాంగుల ఓట్లతో గద్దెనెక్కిన నాయకులు ఖండించరేం..?**

**దివ్యాంగుల హక్కుల, సాధికారితా సంస్థ అధ్యక్షులు డిమాండ్**



హన్మకొండ కేయు, జులై 22 (తీన్మార్ న్యూస్): అఖిల భారత సర్వీస్ లకు దివ్యాంగులకు రిజర్వేషన్ లు అవసరం లేదని అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ స్మితా సభర్వాల్ మీద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని "దివ్యాంగుల హక్కుల మరియు సాధికారితా సంస్థ అధ్యక్షులు, కాకతీయ యూనివర్సిటీ, ప్రజా పాలనా శాస్త్రం విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ళ. శ్రీనివాస రావు డిమాండ్ చేసినారు. సకలాంగులైన కొంతమంది కుహనా మేధావులు, ఉద్యోగులు అదేపనిగా దివ్యాంగులను హేళన, అపహాస్యాలు చేస్తూ మాట్లాడటం పరిపాటిగా మారటం సిగ్గుచేటన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కోడ్ ఆఫ్ కండక్ట్ కు వ్యతిరేకంగా సోయి లేకుండా మాట్లాడిన స్మితా మీద చట్టపరమైన చర్యలు ప్రభుత్వాలు వెంటనే తీసుకోవాలన్నారు.అట్లానే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ ల్లో దివ్యాంగుల హక్కుల చట్టం - 2016 సెక్షన్ 92 ప్రకారం కేసులు నమోదు చేయాలనీ దివ్యాంగులకు పిలుపు ఇచ్చినారు. ఒక పాలనా రంగమే కాదు అన్ని రంగాల్లో సకాలంగుల కన్న దివ్యాంగులే అత్యంత నిజాయితీ, నిబద్ధత తో సేవ అందిస్తున్నారని తెలిపినారు. ఒకలా స్మితా అన్నట్లుగా పైలెట్, సర్జన్ లకు దివ్యాంగులకు అర్హత లేదంటే దానికి సిగ్గుపడలసింది టెక్నాలజీ ని డెవలప్మెంట్ చేయని సైన్స్ దని చెప్పినారు. రాష్ట్రంలో 20 శాతం దివ్యాంగుల ఓట్లతో గద్దెనెక్కిన రాజకీయ నాయకులు ఖండించదానికి ఎందుకు నోరు రావటం లేదని ప్రశ్నించినారు.

# సంక్షేమ హాస్టల్లో పప్పు భోజనమే..



రంగారెడ్డి : సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులకు పప్పు భోజనమే పెడుతున్నారని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను రూ.1500 నుంచి రూ.2500 పెంచాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 20వ తేదీ నుంచి 30 వరకు చేపట్టిన హాస్టల్స్ అధ్యయన యాత్రలో భాగంగా ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని సంక్షేమ హాస్టల్‌ను అధ్యయన బృందంతో పాటు ఆయన సందర్శించి విద్యార్థులతో ముచ్చడించారు. వారికి అందుతున్న ప్రభుత్వ ఫలాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అనేక విషయాలు వెలుగు చూశాయి. ఈ హాస్టల్‌లో కేవలం 80 మంది విద్యార్థులు మాత్రమే అడ్మిషన్ పొందాల్సి ఉండగా.. 160 మందికి అడ్మిషన్ ఇచ్చారని, దాంతో ఉన్న 24 గదుల్లో ఒక్కో గదిలో 6 నుంచి 8మందిని ఉంచుతున్నారని విద్యార్థులు బృంద సభ్యులకు తెలిపారు. ఇలా అనేక సమస్యలను విద్యార్థులు కేవీపీఎస్ బృందం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం స్కైలాబ్‌బాబు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్ల దుస్థితికి ఇబ్రహీంపట్నం హాస్టల్ నిదర్శనమన్నారు. కనీస వసతుల లేమితో విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారని చెప్పారు. 160 మంది విద్యార్థులు ఉంటున్న హాస్టల్లో కేవలం 24 గదులు మాత్రమే ఉన్నాయని తెలిపారు. స్నానాలకు, బట్టలు ఉతుకోవడానికి నీళ్లు సరిపోవటం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 15 నెలలుగా భవనం అద్దె చెల్లించడం లేదని తెలిపారు. ఐదు నెలలుగా కరెంటు బిల్లు బకాయి ఉందన్నారు. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా అదనపు హాస్టల్ భవనాన్ని నిర్మించాలని కోరారు. విద్యార్థుల పోటీ పరీక్షల మెటీరియల్ ప్రభుత్వం అందించాలన్నారు. హాస్టల్లో ఉదయం పూట పెట్టాల్సిన టిఫిన్ ప్రతిరోజూ పప్పుతో కూడిన రైస్ పెడుతున్నారని, కనీసం ఇడ్లీ, వడ పూరి, దోశ వంటివి విద్యార్థులు నోచుకోవట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు పౌరసరఫరాల నుంచి సన్నబియ్యం ఇస్తున్నామని పదేపదే పాలకులు చెబుతున్నారని, కానీ అవి సన్నబియ్యం కాదని అన్నారు. 2016 సంవత్సరం నుంచి మెస్ చార్జీల కోసం కేవలం రూ.1500 మాత్రమే అందిస్తున్నారని, వాటి పెంపుదలకు తక్షణమే బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ వైద్యాధికారులు హాస్టల్స్‌ను నెలకోసారి సందర్శించి విద్యార్థుల ఆరోగ్య సమస్యల్ని తెలుసుకోవాలని జీవో ఉన్నప్పటికీ అది అమలు కావడం లేదని అన్నారు. డీఏహెచ్ హాస్టల్లో వాటర్ సమస్య తీవ్రంగా ఉందని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని సంక్షేమ హాస్టళ్లలో గీజర్ సౌకర్యం కల్పించాలని, మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మించాలని కోరారు. ఈనెల 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా సర్వే నిర్వహించి సమస్యలపై సంక్షేమ శాఖ అధికారుల ను కలిసి వినతి పత్రం అందజేస్తామ న్నారు ప్రభుత్వం దిగివచ్చి విద్యార్థుల సమస్యలు పరిష్క రించకపోతే కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పర్యటించిన వారిలో.. కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోడ సామేల్, ఎం.ప్రకాష్ కరత్, మండల కార్యదర్శి ఎం. ఆనంద్ తదితరులు ఉన్నారు.

# కాళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ



మల్హర్ రావు: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం త్రివేణి సంగమ తీరంలో పుష్కర ఘాట్లను తాకుతూ గోదావరి నది వరద ఉధృతి ప్రవాహం కొనసాగుతోంది. కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహిత నదుల కలయికతో వరద ఉధృతి బాగా పెరిగి 103.56 మీటర్లకు వరద ప్రవాహం చేరింది. వరద ప్రవాహం బాగా పెరుగుతున్న దృష్ట్యా సెంట్రల్ వాటర్ కమిషన్ మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. గోదావరి పెరుగుతున్న దృష్ట్యా సందర్శకులు లోపలికి వెళ్లి స్నానాలు చేయకుండా సూచనలు చేస్తున్నారు. గోదావరి తీర ప్రాంత గ్రామాల ప్రజలు క్రమంగా ఉండాలని ప్రవాహం బాగా పెరిగితే పునరావాస ప్రాంతాలకు ప్రజలు తరలి వెళ్లాలని అధికారులు గ్రామాల్లో దండోరా వేయించారు.

# పల్లె పాలనకు అప్పులు!

**- పంచాయతీల్లో ఆరు నెలలుగా ప్రత్యేకాధికారుల పాలన**

**-అప్పటి నుంచి నిర్వహణ నిధులు ఇవ్వని ప్రభుత్వం**

**- అత్యవసర పనులకు అప్పులు చేస్తున్న కార్యదర్శులు**

మల్హార్ రావు: మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో 24 వేల పైచిలుకు జనాభా ఉంది.గ్రామాల్లో సర్పంచ్ పదవీకాలం ముగిసిన తర్వాత ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ప్రత్యే కాధికారుల పాలన ప్రారంభమైంది. అప్పటి నుంచి గ్రామంలో మోటార్ల మరమ్మతు, బ్లీచింగ్ కొను గోలు, వీధి దీపాల ఏర్పాటు వంటి చిన్నచిన్న మెయిన్ టెయిన్స్ కోసం ఆరు మాసాల కాలంలో రూ.దాదాపు 9 లక్షల పై చిలుకు ఖర్చయింది. ఈ మొత్తంలో ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి రాలేదు. ఆ పంచాయతీ కార్యదర్శులు సొంతంగా రూ.9 లక్షలు అప్పు చేసి గ్రామాల్లో పనులు చేపటారు.ఇది మండలంలోని పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి. పంచాయతీ కార్యదర్శులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఆరు నెలలుగా పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగు తోంది. అప్పటి నుంచి ప్రభుత్వం ద్వారా ఎలాంటి నిధులు మంజూరు కాకపోవడంతో పంచాయతీ కార్యదర్శులే సొంతంగా గ్రామాల్లోని పనులకు డబ్బులు ఖర్చు చేస్తున్నారు. పంచాయతీ నిర్వహణ,మరమ్మతు పనులు తదితర వాటికి అప్పులు చేపి పనులు చేస్తున్నారు.ఎప్పటికప్పుడు ప్రభు త్వం నుంచి బిల్లులు రాకపోవడంతో వారు అప్పు లతో అవస్థలు పడుతున్నారు. మండలంలో 15 గ్రామ పంచాయతీలున్నాయి. పంచాయతీలకు గత ప్రభుత్వం రాష్ట్ర, కేంద్ర ఆర్థిక సంఘాలు నిధులు ఇచ్చాయి. ఎన్నికల ముందు నుంచే రాష్ట్ర నిధులు ఆగిపోవడం, కేంద్ర నిధులు కూడా వెనకాముందు వస్తుండటం



తో పంచాయతీల్లో పాలకవర్గాలు చివరలో అత్యవసర పనులకు సర్పంచ్లు అప్పులు తెచ్చి పనులు నిర్వహించారు. ఫిబ్రవరి 2వ తేదీతో సర్పంచ్ల పదవీకాలం ముగిసిపోయింది. ప్రత్యేక అధికారుల పాలన అమలులోకి వచ్చింది. అప్పటి నుంచి కొత్త ప్రభుత్వం ఇప్పటి వరకు పైసా నిధులు విడుదల చేయలేదు.గతంలో సర్పంచ్లు ఉండటంతో వారే అన్నీ చూసు కునేవారు. ప్రస్తుతం కార్యదర్శులపైనే ఆ భారం పడింది.

### అప్పు తెచ్చి పనులు చేస్తున్న కార్యదర్శులు..

గ్రామ పంచాయతీల్లో నీటి సరఫరా మోటార్ల మర మ్మతు, చెత్త సేకరణ ట్రాక్టర్ డీజిల్, బ్లీచింగ్ కొనుగోలు, స్ట్రీట్ లైట్లు కాలిపోతే కొత్తవి వేయడం వంటి పనులన్నీ అత్యవసరమైనవి. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని చెబుతున్న ప్రభుత్వం పైసలు మాత్రం విడుదల చేయడం లేదు. దీంతో పంచాయతీ కార్యదర్శులే సొంతంగా అప్పుతెచ్చి పనులు చేయిస్తున్నారు. ప్రభుత్వం రెండు రోజుల క్రితం పంచాయతీల్లో పనిచేసే మల్టీ పర్పస్ వర్కర్ల వేతనాలను మంజూరు చేసింది. కానీ పంచాయతీ నిర్వహణకు సం బంధించి నిధులు విడుదల చేయకపోవడంతో కార్యదర్శులు ఇబ్బంది పడుతున్నారు.

# విద్యా వైద్యం ప్రభుత్వ రంగంలోనే ఉండాలి

**- చట్టం ఒకటే అయినా అందరికీ సమానంగా లేదు : రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, జస్టిస్ చంద్రకుమార్**

**- జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఓయూలో సెమినార్**



విద్యా, వైద్యం ప్రభుత్వ రంగంలోనే ఉండాలని, విద్యతోనే సమాజ మార్పు సాధ్యమని, చట్టాలు అందరికీ సమానమేనని రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, జస్టిస్ చంద్రకుమార్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ, ఆంధ్ర మహిళా సభ డిగ్రీ ఉమెన్స్ కళాశాల ఆధ్వర్యంలో 'విద్యా, వైద్య రంగాలు %-% సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకునూరి మురళి మాట్లాడుతూ.. విద్యారంగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. దేశంలో ప్రైమరీ స్కూల్స్‌పై ఇప్పటికీ ప్రభుత్వాలకు, ప్రజలకు స్పష్టత లేదన్నారు. విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచి శాస్త్రీయ ఆలోచనను పెంపొందించేలా పాఠ్యాంశాలు ఉండాలని, అందుకనుగుణంగా పాఠ్యపుస్తకాలను రూపొందించేలా ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. యూనివర్సిటీ స్థాయిలో పనిచేస్తున్న ప్రొఫెసర్లు అశాస్త్రీయ పద్ధతులను పాటించడం ఎంటని ప్రశ్నించారు. యువత ఎక్కువగా సాంకేతిక విద్య పట్ల ఆసక్తి చూపుతోందని, ఇది ఏ మాత్రం మంచిది కాదన్నారు. సామాజిక అంశాలను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఆర్ట్స్, సైన్స్ సమాజ అభివృద్ధికి దోహదం చేస్తాయని తెలిపారు జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. చట్టం ఒక్కటే అయినా అది అందరికీ సమానంగా అందడం లేదని, సమాజంలో పేదలకు సరైన న్యాయం అందడం లేదని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. పేదలకు ఒకలా, ధనవంతులకు మరోలా న్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ విరించి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యతని చెప్పారు. కానీ ప్రభుత్వాలు ఈ బాధ్యత నుంచి క్రమంగా తప్పుకుంటున్నాయని అన్నారు. చిన్న చిన్న రోగాలకు సైతం పేదలు కార్పొరేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సర్కార్ ఆస్పత్రులను బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కోయ వెంకటేశ్వర రావు, టి. శ్రీనాథ్, రాష్ట్ర నాయకులు వెంకటరమణారెడ్డి, జితేందర్, చెలిమెల రాజేశ్వరరావు, ప్రొఫెసర్ బి.యన్.రెడ్డి, డాక్టర్ రమాదేవి, ఎస్పీ లింగస్వామి, రవీంద్రబాబు, భీమేశ్వర్, ఆంధ్ర మహిళా సభ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ పి. రజిని, ప్రిన్సిపాల్ డాక్టర్ ఝాన్సీ రాణి, అధ్యాపకులు కరుణ, వసుంధర, సంధ్యారాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీపురం గ్రామములో పునరావాస కేంద్రం ఏర్పాటు: ఎస్ఐ కమలాకర్

గోవిందరావుపేట: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో వరద బాధితుల కోసం పునరవాస కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని పసర ఎస్ ఐ ఏ కమలాకర్ తెలిపారు. ఆదివారం మండలంలో గత 4 రోజుల నుండి కురుస్తున్న వర్షాన్నీ దృష్టిలో ఉంచుకుని స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలను ఎస్సై కమలాకర్ సిబ్బందితో సందర్శించడం జరిగింది. గత అనుభవాల దృశ్య వరద తాకిడిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేయడం జరిగింది. ఈ క్రమంలోలక్ష్మీపురం గ్రామం లోని ఆశ్రమ పాఠశాల లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేయడమైనదని ప్రజలకు తెలియచేసారు. లక్ష్మీపురం చుట్టూ ప్రక్కల గ్రామాల్లో ఇల్లు కూలిపోవటానికి అవకాశం ఉన్నవారు, ముంపు ప్రాంతాల వారు తాము ఉంటున్న ప్రాంతాలను వదిలి ఈ పునరావాస కేంద్రంలో ఉండాలని సూచించారు. అంతే కాకుండా ప్రజలు అందరూ తుఫాన్ తగ్గేంత వరకు అప్రమత్తంగా ఉండాలని ఏదైనా ప్రమాదం అనిపిస్తే వెంటనే పోలీసు వారికి



సమాచారం అందించాలని చెప్పటం జరిగింది.

# తెలంగాణలో మూడు రోజుల పాటు వర్షాలు

హైదరాబాద్: రాగల మూడు రోజులపాటు తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆయా జిల్లాల్లో వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న అల్పపీడనం సోమవారం బలహీనపడి తూర్పు మధ్యప్రదేశ్, పరిసర ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో కేంద్రీకృతమైంది. దీని అనుబంధ ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6కి.మీ ఎత్తు వరకు విస్తరించి, ఎత్తుకు వెళ్తున్న కొద్దీ ఆగ్నేయం వైపు వంగి ఉంది.రుతుపవన ద్రోణి ఇవాళ జైసల్మేర్, అజ్మీర్, గుణ, తూర్పు మధ్యప్రదేశ్ పరిసర ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో కేంద్రీకృతమై అల్పపీడనం మీదుగా వెళ్తూ.. తూర్పు- మధ్య బంగాళాఖాతం వరకు సగటున సముద్రమట్టానికి 1.5 కి.మీ ఎత్తులో కొనసాగుతోంది. మరోవైపు తెలంగాణలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. పగటివేళ ముసురు వాన కురుస్తుండగా.. రాత్రిళ్లు వాన దంచికొడు



తోంది. హైదరాబాద్ నగరంతోపాటు జిల్లాలు తడిసిముద్ద య్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలు జిల్లాల్లో అనేక గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. సోమవారం భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అప్రమత్తమైన అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి**

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

జయశంకర్ భూపాలపల్లి, వర్షాలకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఐడిఓసి కార్యాలయంలో జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే తో కలిసి అన్ని శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవో లు, ఇరిగేషన్ అధికారులు, పంచాయితి కార్యదర్శులు, పోలీసు అధికారులతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ. జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదు అవుతున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రతి అధికారి తమ విధులు నిర్వహించే కార్యస్తానాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యస్థానాల్లో ఉండటం వల్ల అత్యవసర పరిస్థితుల్లో స్పందించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామాలలో పురాతన ఇళ్లలో ఉండే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. వాగులు, కల్వర్టుల వద్ద ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. చెరువులు, కుంటలను నిరంతరం పర్యవేక్షించాలని నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ రక్షణ చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్రమాదం జరగక ముందే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. మంచినీరు కలుషితం కాకుండా పైపు లైన్ల లీకేజీలను గుర్తించి మరమ్మత్తులు చేయాలని అన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలలో నీటి నిల్వలు ఉండకుండా దోమలు, ఈగలు వ్యాప్తి నియంత్రణకు ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని తెలిపారు. డ్రై డే లో అన్ని శాఖల అధికారులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు..మురుగునీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ వేయించాలని అన్నారు. నిల్వ ఉన్న నీటిని తొలగించాలని తెలిపారు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలని అన్నారు. గర్భిణీ స్త్రీలను గుర్తించి ముందస్తు జాగ్రత్తగా ఆసుపత్రిలకు తరలించాలన్నారు. ఇప్పటి వరకు హై రిస్క్ ఉన్న 11 మంది గర్భిణీలను ఆసుపత్రిలకు తరలించడం జరిగిందని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో జ్వరాల బారిన పడినవారిని గుర్తించి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని అన్నారు. వైద్య సేవలకు 7893323750 నంబర్ ను సంప్రదించాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. గత సంవత్సరం జరిగిన ప్రమాదాలు పునరావృతం కాకుండా తగు రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రతి రోజూ గోదావరి వరద ప్రవాహం ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. మత్స్య కారులు చేపల వేటకు వెళ్ళరాదని , చెరువుల మత్తళ్లుకి ఇనుప చేపల వలలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని మండలాలలో అత్యవసర పరిస్థితులలో అందుబాటులో గజ ఈత గాళ్ళను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. గ్రామాలు,మున్సిపాలిటీలో.ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రం చేయాలని, ప్రజలను వ్యాధులు బారి నుంచి రక్షించాలని తెలిపారు. రూరల్ వాటర్ సప్లై శాఖ ద్వారా క్లోరీమేషన్ మంచినీటి పరీక్షలు నిర్వహించి పరిశుభ్రమైన మంచి నీరు అందించాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం తో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ అన్ని మండలాలలో అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సహకారం తీసుకోవాలని తెలిపారు. గత సంవత్సరం వరదలు సంభవించినప్పుడు పోలీసు సిబ్బంది కీలక పాత్ర పోషించారని ప్రత్యేకంగా మన జిల్లాలో ఒక వాటర్ బోటు 10 మంది శిక్షణ పొందిన పోలీసులతో డిస్ట్రిక్ట్ రిజర్వుడు ఫోర్స్ టీం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితులలో వారి సేవలను వినియోగించుకోవాలని, ఏదైనా అత్యవసర సేవలకు 100 నంబర్ కు కాల్ చేయాలని ఎస్పీ తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆర్డీవో మంగిలాల్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దేశ ఆర్థిక అభివృద్ధిలో గనుల పాత్ర ముఖ్యమైనది

హైదరాబాద్: బేగంపేటలోని వివంతా హోటల్ లో జరిగిన మినరల్ ఎక్స్ప్లొరేషన్ హ్యాకథాన్, క్రిటికల్ మినరల్ రోడ్ షో లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పాల్గోన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ గనుల ఇలీజూశ్రీనీతీజీబితినీని కు సంబంధించి ఇది చాలా ముఖ్యమైన సమయం సందర్భం. ప్రభుత్వ-ప్రైవేటు రంగ భాగస్వామ్యంలో గనుల తవ్వకం లో నూతన ఆవిష్కరణలతో పాటు మైనింగ్ సంబంధిత వర్గాల సంక్షేమం విషయంలో మా ప్రభుత్వం నూతన ఆవిష్కరణలతో వైవిధ్యంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో వారి చొరవ తో భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు. స్వయం సమృద్ధి ని పెంచడమే మా ప్రభుత్వం లక్ష్యం. పారదర్శకతతో మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల సంక్షేమం, క్లీన్ ఎనర్జీని పెంపొందించడం మా ఉద్దేశం. భారత దేశాన్ని ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ ను రూపొందించడం, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడం మా లక్ష్యం. ఈ సాధనలో మైనింగ్ సెక్టార్ ముఖ్యమైన పాత్ర పోషించునుంది మైనింగ్ సెక్టార్ భాగస్వామ్యం తప్పనిసరని అన్నారు. బలమైన మైనింగ్, మినరల్స్ సెక్టార్ లేకుండా స్వయం సమృద్ధి సాధ్యం కాదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఈ రెండూ మన ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభాలు. మన దేశం వేగంగా అభివృద్ధి చెందుతోంది. దాంతో పాటే మినరల్స్ కు డిమాండ్ పెరుగుతున్నది. అందుకే ఆధునిక టెక్నాలజీతో ఖనిజ సంపదను అన్వేషించాల్సిన సమయం ఇది. దీని కోసం ఊఎ ద్వారా ఎక్స్ టెన్సివ్ జియోలాజికల్ డేటా ను రూపొందించాం. ఎక్స్ ప్లోరేషన్ ను పెంచడానికి నేషనల్ మినరల్ ఎక్స్ ప్లోరేషన్ ట్రస్ట్ ను కూడా ఏర్పాటు చేశాం. మినరల్ ఎక్స్ ప్లోరేషన్ కోసం ప్రైవేట్ కంపెనీలను కూడా నోటిఫై చేశాము. ఊఎ ద్వారా నేషనల్ జియో సైన్స్ డేటా డిపాజిటరీపై బేస్ లైన్ జియో సైన్ డేటాను అందుబాటులోకి తెచ్చాం. భవిష్యత్తులో సీస్మిక్ రిఫ్లెక్షన్స్, ఎలెక్ట్రో మాగ్నెటిక్ ఫీల్డ్ ప్రయోగం ద్వారా ఇంకా అడ్వాన్స్ డేటా అందుబాటులోకి తెస్తాం.మినరల్ ఎక్స్ ప్లోరేషన్ లో ఊఎ కొత్త పుంతలు తొక్కుతోంది. ఈ రోజు హ్యాకథాన్ పై ఇన్నోవేటివ్ మినరల్ హంట్ టెక్నిక్ ను ప్రారంభించుకోవడం కోసం మనం ఇక్కడ సమావేశమయ్యామని అన్నారు. 2015కు ముందు మైనింగ్ సెక్టార్లో అనేక సవాళ్లు ఉండేవి. బ్లాక్స్ కేటాయింపు పై అనేక కోర్టు కేసులు నడిచేవి. రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన భాగస్వామ్యం లభించేది కాదు. తగిన నిర్ణయం తీసుకోకపోవడం వల్ల గ్రాంట్, రెన్యువల్స్ ఆగిపోయేవని అన్నారు. గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నేతృత్వంలో 2015లో ఓఓఆఖీ చట్టంలో పలు సవరణలు తెచ్చిన తర్వాతే మైనింగ్ సెక్టార్లో సంస్కరణలు మొదలయ్యాయి. ఆ సంస్కరణల లాభం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నది. ఇప్పటి వరకు 373కి పైగా మైనింగ్ బ్లాక్స్ వేలం పూర్తయింది. అయితే ఈ ప్రయాణంలో 2023లో 24 క్రిటికల్ అండ్ స్ట్రాటజికల్ బ్లాక్స్ ను వేలం వేయడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ రోజు క్రిటికల్ మినరల్ కు సంబంధించి రెండవ, మూడవ ట్రాంచ్ కు చెందిన బిడ్డర్స్ ను ప్రకటించడం నాకు సంతోషంగా ఉంది. వారికి నా అభినందనలు. బిడ్డర్లు త్వరగా ఉత్పత్తి మొదలు పెట్టలని కోరుకుంటున్నాను. ఇదే ఉత్సాహంతో 4వ ట్రాంచ్ బిడ్ కోసం నేటి రోడ్ షో చాలా కీలకమని అన్నారు. భారత ఆర్థిక వృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి స్టేక్ హోల్డర్స్ కు ఇది ఒక గొప్ప అవకాశం. అరుణాచల్ ప్రదేశ్, ఛత్తీస్ గఢ్, జార్ఖండ్, కర్ణాటక, రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్ ఈ 6 రాష్ట్రాల్లో వేలం వేయడానికి 10 కొత్త క్రిటికల్ అండ్ స్ట్రాటజిక్ మినరల్ బ్లాక్స్ ను గనుల శాఖ ఎంపిక చేసింది. మినరల్ ప్రభావిత వర్గాల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం 2015లో 23 రాష్ట్రాల్లోని 645 జిల్లాల్లో డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ లు ఏర్పాటు చేసింది. మినరల్ రంగంలో ఇదో కీలక పరిణామం. మైనింగ్ ప్రభావిత వర్గాల సంక్షేమం విద్య, వైద్యం, స్కిల్ డెవలప్ మెంట్,వారి జీవనోపాధికి ఈ ఫండ్ కీలకంగా ఉంది. ఈ సందర్భంగా నేషనల్ డిఎంఎఫ్ పోర్టల్ ను ప్రారంభించడం నాకు సంతోషంగా ఉంది. ఖనిజ క్షేత్రంలో స్వయం సమృద్ధి సాధించడానికి మా ప్రభుత్వం కృత నిశ్చయమతో ఉంది మనమంతా సంఘటితంగా పనిచేస్తేనే ఇది సాధ్యమవుతుంది. ఈ మహాయజ్ఞంలో అందరూ భాగస్వాములు కావాలని నేను కోరుకుంటున్నాను. మనందరం కలిసి గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి లక్ష్యం ఆత్మ నిర్భర్ భారత్ కలను నిజం చేయడానికి కృషి చేద్దామని పిలుపునిస్తున్నానని అన్నారు.

# ఈనెల 24న దివ్యాంగులకు బస్సు పాసుల జారీ

**ఐకెపి ఏపిఎం కుంట గంగాధర్**

కమ్మర్ పల్లి :మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో ఈనెల 24న బుధవారం దివ్యాంగులకు స్థానికంగా బస్ పాసులు ఆర్టీసీ ఆర్మూర్ డిపో మేనేజర్ సహకారంతో స్థానికంగా జారీ చేయడం జరుగుతుందని ఐకెపి ఎపిఎం కుంట గంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల దివ్యాంగులు వారి యొక్క పాత బస్ పాస్, సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, నాలుగు ఫోటోలు తీసుకొని కమ్మర్ పల్లి ఐకెపి కార్యాలయానికి వస్తే స్థానికంగానే బస్సు పాసులు జారీ చేయడం జరుగుతుందని వెల్లడించారు. దివ్యాంగులు ఆర్మూర్ బస్సు డిపో వరకు వెళ్లి బస్సు పాసుల కోసం క్యూ లైన్ లో నిల్చుని అవస్థలు పడకుండా ప్రతి సంవత్సరం స్థానికంగా ఆర్టిసి డిపో మేనేజర్ సహకారంతో స్థానికంగానే ఐకెపి కార్యాలయంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.అందరు దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని 24 బుధవారం రోజున ఐకెపి కార్యాలయానికి వచ్చి బస్సు పాసులు పొందాలని కోరారు.

ఈ విషయాన్ని యువకులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు అర్హులైన దివ్యాంగులకు చేరవేసి 24వ తేదీన ఐకెపి కార్యాలయానికి పంపి బస్ పాసులు సద్వినియోగం చేసుకొనేలా సహకరించాలని ఏపీఎం కుంట గంగాధర్ విజ్ఞప్తి చేశారు.

# సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- మద్నూర్ పాత బస్టాండ్ లో ప్రయాణికులకు పోలీసుల అవగాహన**

మద్నూర్: ప్రజలారా సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి ఎందుకంటే సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, మీకు ఏదేదో మోసపూరితమైన మాటలు చెప్పి మీ ఆధార్ నంబర్ గాని, మీ అకౌంట్ నెంబర్ గాని, మీ ఓటిపి నంబర్ గాని, అడిగి బ్యాంక్ అకౌంట్ లో ఉన్న డబ్బులు అకౌంట్లో నుండి ఎగ్గొట్టేందుకు బ్యాంకు అధికారుల పేర్లతో ఫోన్లు చేస్తారు. అలాంటి వాటిని నమ్మకుండా ఏది వారికి చెప్పకుండా జాగ్రత్తగా ఉండాలని సోమవారం నాడు మద్నూర్ మండల కేంద్రంలోని పాత బస్టాండ్ లో ప్రయాణికులకు గ్రామస్తులకు పోలీస్



సిబ్బంది సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ కానిస్టేబులు హెూంగార్డులు పాల్గొన్నారు.

# ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు

**-అత్యవసర సమయంలో డయల్ 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వండి**

**-రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్**



మంథని: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా కమిషనరేట్ పరిధిలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలియజేసారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే, స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కి ఫోన్ చేసి పోలీసు వారి సహాయం పొందగలరని తెలిపారు. అధికారుల సూచనలను పాటిస్తూ పోలీసు వారికి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు ఈ జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది కావున ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రాకూడదని సీపీ తెలిపారు. ఎడతెరపీ లేకుండా వర్షాలు కురుస్తున్నందున రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజల భద్రత మరియు ప్రాణా రక్షణ ను దృష్టిలో పెట్టుకొని డ్యామ్స్ మరియు పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేయడం జరిగింది అని సాధారణ పరిస్థితి వచ్చే వరకు అక్కడికి ఎవరు ప్రజలు వెళ్లకూడదని సూచించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీస్ శాఖ పరంగా తగిన ఏర్పాట్లతో ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రజలు పోలీసు వారి సూచనలు సలహాలు పాటిస్తూ సహకరించాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువలు, నదులు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు వెళ్ళరాదన్నారు. చెట్ల కింద, పాడైన భవనాలు కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండరాదు. విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్ఫార్మర్స్ ముట్టుకోరాదన్నారు. ఎవ్వరు కూడా ఎట్టిపరిస్థితుల్లో కూడా చెరువులోకి, నాలాలు , డ్యామ్స్, వాటర్ ఫాల్స్ లేదా చేపల వేటకు గాని వెళ్ళరాదు. అత్యవసరమైతేనే ఇంటి నుండి బయటకు రావాలి. స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, విద్యుత్, ఆర్డబి, వైద్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడైనా రోడ్ల పై వరద ఉధృతితో రోడ్లు తెగిపోయినా, ఉధృతంగా ప్రవహించినా అక్కడికి ఆ గ్రామ ప్రజలు వెళ్లకుండా, రెండు దిక్కులా ప్లాస్టిక్ కోన్స్, బారిగేడ్స్, హెచ్చరిక గల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి పోలీస్టేషన్ పరిధిలో ఉన్న చెరువులు, కుంటల అలుగుల దగ్గర, ప్రధాన రహదారులపై ప్రవహించే వాగులు, వంకల దగ్గర నీటి ప్రవాహం గురించి ముందస్తు సమాచారం తెలుసుకొని, ప్రత్యేక్షంగా వెళ్లి పర్యవేక్షించి పోలీసు అధికారులు, సిబ్బంది అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు. వరద నీటికి చెరువులు, కుంటలు నిండి చెరువు కట్టలు తెగి పోయే ప్రమాదం ఉంటుంది. కావున ప్రజలు అప్రమత్తం గా ఉండలన్నారు. వాహనదారులు ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా ప్రయాణించండి. వర్షానికి రోడ్లు కొట్టుకుపోయి, గుంతలు ఏర్పడి అందులో నీరు నిల్వ ఉండి ఆ గుంతలు వాహనదారులకు కనిపించక ప్రమాదానికి గురి అయ్యి ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంది. కావున జాగ్రత్తగా, నెమ్మదిగా చూసుకొని ప్రయాణించలన్నారు. వర్షాలకు కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జి ల వద్ద నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయరాదు అని సూచించారు.

# నిరుద్యోగులకు 6 నుంచి 10 వేలు

ముంబై, మహారాష్ట్రలోని ఏక్ నాథ్ శిండే ప్రభుత్వం సంచలన పథకాన్ని ప్రకటించింది. డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులకు భారీ నిరుద్యోగ భృతిని ప్రకటించింది. ఈ పథకంలో భాగంగా 12వ తరగతి పాసైన వారికి నెలకు రూ.6 వేల భృతిని ప్రభుత్వం అందించనుంది. డిప్లొమా పూర్తి చేసిన వారికి నెలకు రూ.8 వేలు లభించనుంది. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారికి అత్యధికంగా నెలకు రూ.10 వేలు ప్రభుత్వం ఇవ్వనుంది. విద్యార్థులు తమ చదువు పూర్తి చేసుకొని ఉద్యోగం సాధించేవరకూ అండగా ఉండే ఉద్దేశంతో ఈ ఆర్థిక సాయం ప్రకటించినట్లుగా ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షించే వెల్లడించారు. తొలి ఏకాదశి సందర్భంగా పండరిపూర్‌లో ముఖ్యమంత్రి ఈ పథకాన్ని ప్రకటించారు. ఈ భారీ పథకాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగానే ఈ సమయంలో ప్రకటించింది. మరికొద్ది నెలల్లో మహారాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి. అందులో నిలదొక్కుకోవడం కోసమే ఏక్ నాథ్ షిండే ప్రభుత్వం ఈ పథకాన్ని ఇప్పుడు తెచ్చిందని చెబుతున్నారు. ఈ పథకం అమలు చేస్తే ప్రభుత్వంపై ఏకంగా రూ.5,500 కోట్ల భారం పడనుంది. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఈ పథకాన్ని ప్రకటిస్తూ.. 'లాడ్లీ బెహన్ యోజన' పథకం గురించి కూడా ప్రస్తావించారు. మహిళల కోసం ఈ పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. త్వరలోనే నెలకు రూ.1500 మా అక్కాచెల్లెళ్ల ఖాతాలో జమ చేస్తామని అన్నారు. ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం జూలై 1, 2024 నుండి అమలు చేస్తామని చెప్పారు. అందుకే, అన్నదమ్ముల కోసం కూడా కొత్త పథకాన్ని మొదలుపెట్టినట్లు చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక కూడా ఇలా ఉంటుందని సీఎం చెప్పారు. చదువు పూర్తయిన యువకుడు ఏడాదిపాటు పరిశ్రమ లేదా పరిశ్రమయేతర కంపెనీలో అప్రెంటిస్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత అక్కడ వర్క్ ఎక్స్ పీరియన్స్ సంపాదించి, ఆ అనుభవంతో ఉద్యోగం కూడా సంపాదించుకోవచ్చు.

ఒక విధంగా ఈ పథకం ద్వారా స్కిల్ కలిగిన మానవవనరులను సృష్టిస్తున్నట్లు ఏక్ నాథ్ షిండే చెప్పారు. రాష్ట్రంతో పాటు దేశంలోని పరిశ్రమలకు నైపుణ్యం కలిగిన యువతను అందించబోతున్నామని అన్నారు.

# పొత్తులు... కత్తులు...

హైదరాబాద్, భారత రాష్ట్ర సమితి పార్టీ బీజేపీలో విలీనం లేదా పొత్తు కోసం చర్చలు పూర్తయ్యాయని కొద్ది రోజులుగా చర్చ జరుగుతోంది. కేటీఆర్, హరీష్ రావు ప్రత్యేకంగా వారం రోజుల పాటు ఢిల్లీలో మకాం వేసి వచ్చిన తర్వాత ఈ ప్రచారం ఊపందుకుంది. అయినా బీఆర్ఎస్ వైపు నుంచి ఖండన ప్రకటనలు రావడం లేదు. ఢిల్లీలో చర్చలు జరిపారని భావిస్తున్న హరీష్ రావు, కేటీఆర్ సైలెంట్ గా ఉండటంతో ఆ చర్చలు నిజమని అందరూ నమ్ముతున్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర బీజేపీ నేతల్లో ఏకాభిప్రాయం కోసం హైకమాండ్ సంప్రదింపులు జరుపుతున్నట్లుగా చెబుతున్నారు. బీఆర్ఎస్ పార్టీతో పొత్తా లేకపోతే విలీనమా అన్న అంశాలపై అభిప్రాయసేకరణ జరుపుతున్నారు. ముగ్గురు ఎంపీలు బీఆర్ఎస్‌తో అసలు ఎలాంటి సంబంధాలు పెట్టుకోవద్దని గట్టిగా పట్టుబడుతున్నారని అంటున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీతో విలీనం చేసుకున్నా.. పొత్తులు పెట్టుకున్నా అది బీజేపీకి నష్టం చేస్తుందని వారు వాదిస్తున్నారు. బీఆర్ఎస్ బలహీనపడుతోందని ఆ పార్టీ ఓటు బ్యాంక్ క్రమంగా బీజేపీకి దగ్గరవుతోందని చెబుతున్నారు. ఇలాంటి సమయంలో వారితో పొత్తులు లేదా విలీనం అనే రాజకీయ పరిణామాలు సంభవిస్తే.. అది బీజేపీకి మైనస్ అవుతుందని వారు గట్టిగా చెబుతున్నారు. మరో ఇద్దరు ఎంపీలతో పాటు కొంత మంది సీనియర్ నేతలు బీఆర్ఎస్ పార్టీని విలీనం చేసుకోవడం మంచిదనేని హైకమాండ్ కు చెబుతున్నారు. ఉద్యమ పార్టీగా ఆ పార్టీకి గ్రౌండ్ లెవల్‌లో క్యాడర్ ఉందని ఆ పార్టీ క్యాడర్ వల్ల బీజేపీ ఆటోమేటిక్ గా బలపడుతుందని చెబుతున్నారు. మిగిలిన ముగ్గురు ఎంపీలు హైకమాండ్ పార్టీకి ఏది మంచిదో అదే నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నట్లుగా తెలుస్తోంది. పార్టీ నేతలంతా ఏకాభిప్రాయానికి రాలేకపోతూండటంతో ఈ అంశంపై పార్టీ హైకమాండ్ ఇంకా సంప్రదింపులు జరుపాలని అనుకుంటోంది. ఈ కారణంగానే ప్రకటన ఆలస్యమవుతోందని బీజేపీ వర్గాలు అంటున్నాయి. బీఆర్ఎస్ రాజ్యసభ పక్షం బీజేపీలో విలీనం ఖాయమని ఇప్పటికే చెబుతున్నారు. పరిస్థితుల్ని బట్టి పార్టీ విలీనంపై మాట్లాతారని అనుకున్నారు. బీజేపీ పార్టీలో వచ్చే వ్యతిరేకతను బట్టే కాస్త తగ్గుతున్నారని అంటున్నారు. రెండు పార్టీలు విలీనం అయితే ..త తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సంగతి చూడవచ్చన్న ఆలోచనతో పార్టీ మారాలనుకుంటున్న కొంత మంది నేతల్ని బీఆర్ఎస్ నేతలు ఆపుతున్నట్లుగా తెలుస్తోంది. మొత్తంగా బీఆర్ఎస్ రాజకీయం.. బీజేపీలోని పరిణామాలపై ఆధారపడి ఉంది.

# ఆందోళనకు బీజేపీ వ్యూహం

హైదరాబాద్, తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై పోరుకు భారతీయ జనతా పార్టీ సన్నద్ధమవుతోంది. వందరోజుల హామీలు 8 నెలలైన అమలు చేయకపోగా.. డిక్లరేషన్ల పేరుతో ఆయా వర్గాలను వంచించారంటూ టీబీజేపీ నిరసన సభలకు సన్నాహకాలు చేస్తోంది. ఓ వైపు అధికార కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో మెజారిటీ అమలు చేస్తున్నామని.. ఒక్కో హామీ నెరవేరుతోందంటూ సంబరాలు చేసేందుకు రెడీ అవుతోంది. దానికి పోటాపోటీగా విపక్ష బీజేపీ అటకెక్కిన మరిన్ని హామీలంటూ ఆందోళనలకు శ్రీకారం చుడుతోంది. రాష్ట్రంలో మరికొద్ది రోజుల్లో రానున్న లోకల్ బాడీ ఎన్నికలే లక్ష్యంగా అన్ని పార్టీలు పావులు కదుపుతున్నాయి. అందుకు అధికార హస్తం పార్టీ సైతం హామీలు అమలు చేస్తున్నామంటూ ప్రజల్లోకి వెళ్లేందుకు ఉత్సావాల పేరిట కార్యక్రమాలకు రూపకల్పన చేస్తోంది. అయితే ప్రతిపక్ష పాత్రలోకి పరకాయ ప్రవేశం చేసిన కమలం పార్టీ ప్రభుత్వ వైఫల్యాలను జనంలోకి తీసుకెళ్లాలని గట్టిగా నిర్ణయించుకుంది. ఇప్పటికే నిరుద్యోగుల సమస్యలపై బీజేవైఎం రోడ్లెక్కి ధర్నాలు, పార్టీ కార్యలయాల ముట్టడిలు చేపట్టగా.. మహిళలకు రక్షణ లేదంటూ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఇటీవల ధర్నాచౌక్?లో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాడానికి ఆయా జిల్లా కేంద్రాల్లో డిక్లరేషన్ల పేరుతో భారీ సభలు పెట్టి హామీలు ఇచ్చి అరకొరగా అమలుతో ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ ఆరోపిస్తోంది. కాంగ్రెస్ ఎక్కడైతే డిక్లరేషన్లు పెట్టిందో అక్కడే అదే వర్గాల ప్రజలతో నిరసన సభలకు కాషాయ దండు స్కెచ్ వేసింది. కాంగ్రెస్ చేస్తోన్న మోసాలను తాము అక్కడే డిక్లేర్ చేస్తామంటూ కమలం నేతలు చెబుతున్నారు. నిరుద్యోగులకు రాహుల్ గాంధీ, రేవంత్ ఎక్కడైతే సీటీ సెంట్రల్ లైబ్రరీ దగ్గర జాబ్ క్యాలెండర్ హామీ ఇచ్చారో అక్కడి నుంచే పోరాటానికి బీజేపీ రెడీ అయింది.. వరంగల్?లో కాంగ్రెస్ రైతు డిక్లేరేషన్ ఇచ్చిన చోటే రైతులతో అతిపెద్ద నిరసన సభ పెట్టి హస్తం పార్టీ మోసాన్ని డిక్లేర్ చేస్తామని బీజేపీ నేతలు చెప్పారు. చేవెళ్లలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, సరూర్ నగర్?లో యూత్ డిక్లరేషన్, కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్, హైదరాబాద్?లో మైనార్టీ డిక్లరేషన్లు కాంగ్రెస్ ప్రకటించింది. ఆయా ప్రాంతాల్లోనే హామీలు అమలు వైఫల్యాలను ఎండగట్టాలని.. భారీ నిరసన సభలతో రేవంత్ సర్కారు మోసాలను ప్రజలకు వివరిస్తామని బీజేపీ అంటోంది కమలం పార్టీ. మొత్తంగా రాష్ట్రంలో అధికార విపక్షాల మధ్య మరో ఆసక్తికర పోరు నెలకొంది.

# ఉగ్రరూపం దాల్చిన బొగత..

**పరవళ్ళు తొక్కుతు పర్యాటకుల మనసు దోచుకుంటున్న జలపాతం..**

**బొగత జలపాతానికి భారీగా చేరిన వరద నీరు..**

**పర్యాటకులను కనువిందు చేస్తున్న జలపాతం..**

**భారీగా వరద నీరు చేరడంతో నీటి కొలనులోకి పర్యాటకులను వెళ్లవద్దన్న. అధికారులు ..**

ములుగు: ఎగువ కురుస్తున్న భారీ వర్షాలతో పాటు గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ములుగు జిల్లా వాజేడు మండలం లోని బొగత జలపాతం ఉగ్ర రూపం దాల్చుతుంది. బొగత జలపాతం వద్ద భారీగా వరద నీరు చేరడంతో పర్యాటకులు జలపాతాన్ని చూసి మంత్ర ముగ్ధులవుతున్నా ముగ్ధ లవుతున్నారు. పర్యాటకులు సుదూర ప్రాంతాల నుండి వచ్చి జలపాతాల అందాలను చూసి ఎంజాయ్ చేస్తున్నారు. జలపాతం వద్ద భారీగా వరద నీరు చేరడంతో పర్యాటకులు నీటి కొలనులో కి వెళ్ళే అవకాశం లేకపోవడం తో జలపాతం వద్దనే జలపాత అందాలను చూసి ఎంజాయ్ చేస్తున్నారు. పాల నురుగు వలె జారిపోతున్న జలపాతాల్ని చూడడానికి రెండు కళ్ళు సరిపోవడం లేదని పర్యాటకులు అంటున్నారు. జలపాతం వద్ద వరద నీరు చేరడంతో అధికారులు పర్యాటకులను నీటి కొలనులోకి వెళ్లకుండా జాగ్రత్త లు తీసుకుంటున్నారు. వర్షంలో సైతం పర్యాటకులు జలపాతానికి భారీగా వస్తున్నారు. పర్యాటకులను జలపాతం లోకి వెళ్లకుండా అటవీశాఖ అధికారులకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దట్టమైన అటవీప్రాంతం నుండి కొండ కోణాల నడుమ జాలువారుతున్న జలపాతాన్ని చూసి పర్యాటకులు ఎంజాయ్ చేస్తున్నారు.

# డేంజర్ బెల్ మ్రోగిస్తున్న డెంగీ

కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విష జ్వరాలు విజృంభించాయి. డెంగీ ఫీవర్ డేంజర్ బెల్ మోగిస్తుంది. సీజనల్ వ్యాధులు ప్రజల్ని భయాందోళనకు గురిచేస్తున్నాయి. వైరల్ ఫీవర్స్ తో పాటు డెంగ్యూ కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. జ్వర పీడితులతో ఆసుపత్రులన్ని కిటకిటలాడుతున్నాయి. ఇప్పటికే డెంగ్యూ జ్వరంతో వేములవాడ మండలంలో ఒకరు, సుల్తానాబాద్ లో మరొకరు ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. రోజుకు రెండు డెంగీ కేసులు నమోదు అవుతున్నాయి. కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో గురువారం ఒక్కరోజే మూడు కేసులు నమోదయ్యాయి. విషజ్వరాలు, డెంగీ కేసుల పట్ల వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కావలసిన మందులు, బెడ్స్ సిద్దం చేశారు. వానకాలం నేపథ్యంలో వాతావరణ మార్పులు వచ్చి వ్యాదులు ప్రజల్ని వణికిస్తున్నాయి. జ్వరం, దగ్గు, జలుబుతో ఇబ్బందిపడుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. దీంతో జిల్లాలోని ఆసుపత్రులు పేషెంట్లతో కిటకిటలాడుతున్నాయి. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపి పెరిగింది. గత వారం రోజులుగా రోజుకు వెయ్యి మందికి పైగా ఔట్ పేషెంట్ లు హాస్పిటల్ లో వైద్యం పొందుతున్నారు ఇందులో ఎక్కువగా సీజనల్ వ్యాధుల వారే ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. డాక్టర్లకు చూపించుకునేందుకు వందలాది మంది క్యూలైన్లలో వేచి చూడాల్సి వచ్చింది. వీళ్లలో చాలా మంది అడ్మిట్ అయ్యారు. జ్వర పీడితుల కోసం ఇప్పటికే రెండు వార్డులు ఉన్న ప్పటికీ పేషెంట్ల సంఖ్య పెరుగుతుండడంతో అదనపు వార్డును ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి వెల్లడించారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రులు డాక్టర్లు అందుబాటులో ఉన్నారని, మందుల కొరత లేదని స్పష్టం చేశారు. జ్వరం వస్తే వెంటనే డాక్టర్ ను సంప్రదించాలని కోరారు. ఉమ్మడి జిల్లాలోని సీహెచ్ సీలు, పీహెచ్ సీల లో జ్వరం పీడితులు, సీజనల్ వ్యాధిగ్రస్తులు రోజు రోజుకు పెరుగుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో డెంగ్యూ కేసులు అధిక సంఖ్యలో నమోదవుతున్నాయి. గత నెలలో 135 డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదు కాగా ఈనెలలో ఇప్పటి వరకు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో 18 కేసులు నమోదయ్యాయి. డెంగ్యూ లక్షణాలతో హాస్పిటల్ కు వస్తున్నవారి సంఖ్య పెరుగుతున్నట్లు డాక్టర్లు వెల్లడించారు. జ్వరం వచ్చినంత మాత్రాన భయపడాల్సిన అవసరం లేదని వైద్యులు అంటున్నారు. జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచిస్తున్నారు. కాచి చల్లార్చిన నీళ్లను తాగాలని కోరుతున్నారు. దోమల భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

# క్రాస్ రోడ్ లో గంగుల...

కరీంనగర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మాజీ మంత్రి గంగుల కమలాకర్ రాజకీయ భవిష్యత్‌పై ఆసక్తికర చర్చ జరుగుతోంది. జిల్లాలో బలమైన బీసీ నేత గంగుల. బీసీ వర్గాలలో మంచి పట్టున్న లీడర్‌గా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్ దగ్గర గుర్తింపు తెచ్చుకున్నారు గంగుల. ఆ ఇద్దరికి నమ్మిన బంటుగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో చక్రం తిప్పారు. గంగులకు ఏ పని అప్పగించినా, దాన్ని విజయవంతం చేయడానికి కష్టపడి పనిచేస్తారని కూడా చెబుతుంటారు. అలా అధినేత నమ్మకాన్ని చూరగొన్న గంగుల.. ప్రస్తుతం పార్టీ అధినాయకత్వానికి అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లాలోనూ పార్టీతో పెద్దగా సంబంధం లేదన్నట్లే వ్యవహరిస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు కరీంనగర్ జిల్లా అంటే ప్రత్యేక సెంటిమెంట్‌గా చెబుతారు. అలాంటి జిల్లాలో గంగులకు పెద్దరికం అప్పగిస్తే.. ఇప్పుడు పార్టీ కష్టకాలంలో ఆయన ఉలుకూ పలుకూ లేకుండా గడపడమే చర్చనీయాంశమవుతోంది. ఉమ్మడి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీని వీడుతున్నా? స్పందించకుండా సైలెంట్‌గానే ఉంటున్న గంగుల తీరు పలు సందేహాలకు తావిస్తోందిఎప్పుడూ హాట్‌హాట్ కామెంట్లు చేసే గంగుల ఇప్పుడు మౌనాన్ని ఆశ్రయించడం? ఆయన అనుచరులు కూడా అర్థం చేసుకోలేకపోతున్నారు. వాస్తవానికి గంగుల పార్టీ మారతారని చాలా రోజుల క్రితమే ఊహాగానాలు మొదలయ్యాయి. నెక్ట్స్ గంగులే అంటూ దాదాపు నెల రోజులుగా ఆయన పేరు ప్రచారంలో ఉంది. కానీ, తాను పార్టీని వీడుతానని గానీ, వీడనని గాని ఆయన స్పందించలేదు. తొలినాళ్లలో అధినేత కేసీఆర్‌ను కలిసిన గంగుల.. ఆ తర్వాత సైలెంట్ అయిపోయారు. ఆయన పేరు అలా ప్రచారంలో ఉండగానే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వరుసగా రోజుకొకరు చొప్పున కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఎవరూ ఊహించని విధంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కాంగ్రెస్‌లో చేరారు. సంజయ్ పార్టీని వీడటంపై జిల్లాలోని కీలక నేతలంతా తప్పుపట్టారు. ఎమ్మెల్యేపై తీవ్ర విమర్శలు చేశారు. అప్పుడు కూడా పెదవి విప్పలేదు గంగుల. బీఆర్ఎస్ సీనియర్ నేతల్లో ఒకరైన గంగుల? అధికారం కోల్పోయాక? పార్టీతో అంటీ ముట్టనట్లే వ్యవహరిస్తుండటం చర్చకు దారితీస్తోంది. బీఆర్ఎస్ ముఖ్యనేతలు అంతా ప్రభుత్వంపై ఏదో రూపంలో పోరాడుతుంటే.. గంగుల మాత్రం గప్‌చుప్‌గానే ఉంటున్నారు. దీనికి కారణం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో గంగులకు ఉన్న పరిచయాలేనా? అనే అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి గంగుల టీడీపీలో కలిసి పనిచేశారు. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య మంచి సంబంధాలే ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కారణంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి గంగుల వెనకడుగు వేస్తున్నారనే ప్రచారం కూడా ఉంది.

ఈ పరిస్థితుల్లో గంగుల అంతరంగం ఏంటో అర్థం చేసుకోలేక బీఆర్ఎస్ క్యాడర్ తర్జనభర్జన పడుతోంది. ఇటు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోనూ? అటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనూ సత్సంబంధాలు కోరుకుంటున్న గంగుల? సైలెంట్‌గా ఉండటమే మేలనుకుంటున్నారా? అనే సందేహాలు ఎక్కువవుతున్నాయి. మరోవైపు కాంగ్రెస్‌లో చేరేందుకు గంగుల ఆసక్తిగా ఉన్నా, మంత్రి పొన్నం కారణంగా?. ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం హుస్నాబాద్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి పొన్నం కరీంనగర్‌లో పట్టుకోసం ప్రయత్నిస్తున్నారని అంటున్నారు. కరీంనగర్‌లో వరుసగా గెలుస్తున్న గంగుల? పొన్నంతో ఆధిపత్య పోరు ఉంటుందనే ఉద్దేశంతో కాంగ్రెస్‌లో చేరికపై ఎటూ తేల్చుకోలేకపోతు న్నారని అంటున్నారు. మరోవైపు గంగులపై జరుగుతున్న ప్రచారమంతా.. ఉట్టి గాసిప్పేనని తేల్చేస్తున్నారు ఆయన అనుచరులు. ఏదైనా సరే గంగుల మౌనవ్రతం వీడితేనే ఈ సస్పెన్స్‌కు తెరపడుతుంది. మరి ఆయన ఎప్పటి వరకు ఈ సస్పెన్స్ కొనసాగిస్తారో..? ఆయన అంతరంగం ఎప్పటికి ఆవిష్కరిస్తారో అనేది ఉత్కంఠ రేపుతోంది.

# ఖమ్మం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో వైద్యం కరువు...

**ముచ్చట్లకు పరిమితమైన డాక్టర్లు.**

**ముగ్గురు మంత్రులు ఉన్న జిల్లాలో**

**పాము కరిచిన మహిళకి వైద్యం కరువు..**

ఖమ్మం: ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన బి.వెంకటమ్మ, కూలి పనిలో భాగంగా పొలంలో పనికి వెళితే పాము కాటు వేసింది దీంతో హుటాహుటిన కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళితే ఒపి రాయడానికి సుమారు 15 నిమిషాలు ఆ తరువాత మళ్ళీ లోపలికి వెళితే టెస్టు చేయించుకొని రండి అంటూ ఆ తరువాత ఫైల్ తీసుకొని రండి అంటూ టైం వేస్ట్ చేసిన డాక్టర్లు ముగ్గురు డాక్టర్లు ఒకే చోట కూర్చొని నవ్వుతూ ముచ్చట్లు పెట్టుకుంటూ జోకులు వేసుకుంటూ నవ్వుతున్న వైనం..కనీసం పాము కరిచి నడవలేని స్థితిలో ఉన్న మహిళను కుర్చీ లోంచి లేచి వచ్చి చూడరా మేడం అని అడిగితే అరవకండి అంటూ దురుసుగా సమాధానం చెప్తున్న వైనం ఇట్లాంటి పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి మంచి వైద్యం అందించాల్సిన వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నిరుపేద ప్రజలకు వైద్యం అందే పరిస్థితులు కనిపించడం లేదు..నిర్ణీత సమయానికి ఉదయం రావాల్సిన వైద్య సిబ్బంది తమకు నచ్చిన సమయానికి వస్తూ మధ్యాహ్నం లోపే ఇంటిదారి పడుతున్నారని రోగులు ఆరోపిస్తున్నారు.. ఈ సందర్భంగా బాధితురాలు వెంకటమ్మ మాట్లాడుతూ.

ముగ్గురు మంత్రులు ఉన్న ఇలాకలో ఖమ్మం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో వైద్య సిబ్బంది పేషెంట్లపై వ్యవహరిస్తున్న తీరు నిర్లక్ష్యం సరైనది కాదని ప్రజల సొమ్మును జీతాలుగా తీసుకుంటూ వైద్యం కోసం వచ్చిన ప్రజలను బానిసలుగా చూడటం సరైనది కాదని దీనిపై జిల్లా వైద్యశాఖ తక్షణమే చర్యలు తీసుకొని పేషంట్ల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న డాక్టర్లను వెంటనే సస్పెండ్ చేయాలని తన లాగా వేరొక పేషెంట్ కు ఇబ్బంది కలగకుండా చూడాలని జిల్లా అధికారులను, ముగ్గురు మంత్రులను సోషల్ మీడియా ద్వారా కోరడం జరిగింది.

# ఆస్తి కోసం దారుణం.. తండ్రిపై దాడి చేయించిన తనయుడు

హైదరాబాద్: ఆస్తి కోసం కన్న కొడుకే ఓ వృద్ధ తండ్రి పై దాడి చేయించాడు. తన కొడుకు కోడలు, వారి బంధువుల నుండి ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలని బాధిత తండ్రి కళ్లెం నర్సింహా రెడ్డి తెలంగాణ డిజిపి ని కలిసి వేడుకున్నాడు. హైదరాబాద్ దోమలగూడ కి చెందిన కళ్లెం నర్సింహా కొడుకు చంద్ర శేఖర్ రెడ్డి , కోడలు పద్మలతలు ఆస్తి కోసం పద్మలత తన బావ అయిన కొంపల్లి కి చెందిన గ్రాంఖీ గార్డెన్స్ యజమాని సాదా నర్సింహా రెడ్డి తో తన పై దాడి చేయించాడని బాధిత తండ్రి పిర్యాదు లో పేర్కొన్నాడు. మాజీ మంత్రి మల్లా రెడ్డి ప్రొద్భలంతో, అండతో ఆదివారం సాదా నర్సింహా రెడ్డి కుటుంబ గెట్ టూ గెదర్ ఉందని తనను పిలిపించి.. మల్లా రెడ్డి తో పాటు మరో పది మంది పెద్దల సమక్షంలో తన పై తీవ్ర పదజాలంతో దుర్భాదలడుతూ తల పై దాడి చేసి చితక బాదాడని తెలిపాడు.

# బీజేపీ, బీఆర్ఎస్.. ఎవరి వ్యూహాలు వారివి...

హైదరాబాద్, తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు హాట్ టాపిక్ బీఆర్ఎస్ భవిష్యత్ . ఆ పార్టీ బీజేపీతో టై అప్ కోసం చర్చలు జరుపుతోంది. కుదిరితే పొత్తు లేకపోతే విలీనం అన్నట్లుగా ఢిల్లీలో ఒక రౌండ్ చర్చలు ముగిశాయని ప్రచారం జరుగుతోంది. ఈ అంశంపై బీఆర్ఎస్ పార్టీ చీఫ్ కేసీఆర్ ను.. మజ్లిస్ చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ కూడా ప్రశ్నించారు. స్పందించాలని డిమాండ్ చేశారు. కానీ బీఆర్ఎస్ వైపు నుంచి ఎలాంటి స్పందనా రావడం లేదు. ఈ కారణంగా ఇవాళ కాకపోతే రేపైనా బీఆర్ఎస్ , బీజేపీ విలీనం లేదా పొత్తులు ఖాయమని నమ్ముతున్నారు. ఈ పరిణామం వల్ల బీజేపీ ఎంత లాభ పడుతుందన్న సంగతి పక్కన పెడితే.. అస్థిత్వానికే ముప్పు వచ్చే ప్రమాదమున్నా ఎందుకు బీఆర్ఎస్ తొందరపడుతోంది ? . ఎలాంటి ప్రయోజనాలను ఆశిస్తోంది ? అన్నది పెద్ద పజిల్ గా మారింది. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవిత అరెస్ట్ అయి నాలుగు నెలలు దాటింది. ఆమె తీహార్ జైల్లోనే ఉన్నారు. ఆమెను బయటకు తీసుకు రావడానికి కేసీఆర్ రాజకీయ వ్యూహల పరంగా ప్రయత్నిస్తున్నారని అందుకే బీజేపీతో సంబంధాల దిశగా చర్చలు జరుగుతున్నాయని ఎక్కువ మంది చెప్పుకుంటున్నారు.

అయితే ఒక్క బెయిల్ కోసం పార్టీని త్యాగం చేస్తారని ఊహించలేరు. కవితను ఇంకా ఎంతో కాలం జైల్లో పెట్టలేరని..న్యాయవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇటీవల కేజ్రీవాల్ కు కూడా సుప్రీంకోర్టు ఈడీ కేసులో బెయిల్ మంజూరు చేసింది. అలాగే కవితకూ బెయిల్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. కేసులో చార్జిషీట్ల పేరుతో ఇంత కాలం జైల్లో పెట్టలేరని ... అటూ ఇటూగా జైలు నుంచి వచ్చేస్తారని అనుకుంటున్నారు. మరి ఇలాంటి సమయంలో పార్టీని .. కేవలం కవిత కోసమే బీజేపీ తో పొత్తుల కోసం వెళ్తారని అనుకోవడం లేదు. కేసీఆర్ ఫామ్ హౌస్‌లో ఆ మధ్య కొంత మంది పార్టీ నేతల్ని కలిశారు. పార్టీ త్వరలో అధికారంలోకి వస్తుందని వారికి ధైర్యం చెప్పారు. అయితే చాలా మంది ఈ విషయంలో క్యాడర్ కు భరోసా ఇవ్వడనికి చెప్పారని అనుకున్నారు. కానీ కేసీఆర్ మాత్రం అలాంటి ప్లాన్ లో ఉన్నారని బీజేపీతో చర్చల గురించి బయటకు వచ్చిన తర్వాత క్లారిటీ వచ్చింది. బీజేపీతో అయితే పొత్తులు పెట్టుకుని లేకపోతే విలీనం చేసి అయినా సరే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టి.. సంకీర్ణ ప్రభుత్వాన్ని అయినా ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో కేసీఆర్ ఉన్నారని చెబుతున్నారు. అధికారికంగా బీఆర్ఎస్‌కు 38 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. బీజేపీకి ఎనిమిది మంది ఉన్నారు. ఈ రెండు పార్టీలు కలిసినా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేరు. కానీ కేసీఆర్.. అరవై మంది ఎమ్మెల్యేలను తీసుకుని వచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని ఓ సీనియర్ నేత తనకు ఫోన్ చేశారని ఆయన గతంలో చెప్పారు. బీజేపీ తల్చుకుంటే ఆపరేషన్ కమల్ ప్రారంభిస్తే.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల్ని ఆకర్షించడం పెద్ద పనేమీ కాదని ఎక్కువ మంది భావన. ఈ ఆలోచనలతోనే కేసీఆర్ బీజేపీతో కలిసిపోయేందుకు సిద్ధమయ్యారని అంటున్నారు. తర్వాత ఎన్నికల వరకూ ఉంటే.. సర్వైవ్ అవుతామా లేదా అన్నది చెప్పలేరు..కానీ ఇప్పుడు అధికారంలోకి పొత్తులు పెట్టుకుని అయినా వస్తే..చాలా సమస్యలు పరిష్కారం అవుతాయన్న ఆలోచనలో కేసీఆర్ ఉన్నారని అనుకోవచ్చు. కాంగ్రెస్ పార్టీ త్వరగానే కేసీఆర్ వ్యూహాన్ని పసిగట్టినట్లుగా ఉంది. చేతులు కాలేదాకా ఊరుకోవడం కన్నా వెంటనే ప్రభుత్వాన్ని కాపాడుకోవడం మంచిదన్న ఉద్దేశంతో రంగంలోకి దిగిపోయారు. ఇప్పటికే పది మంది ఎమ్మెల్యేలను చేర్చేసుకున్నారు. ఆ మేరకు బీఆర్ఎస్ బలం తగ్గిపోయింది. మరో పది మందికిపైగా కాంగ్రెస్ లో చేరుతారన్న ప్రచారమూ ఉంది. అంటే.. మొత్తంగా బీఆర్ఎస్ వైపు తగ్గిపోయే బలం కాంగ్రెస్ వైపు చేరుతోంది. నలభై మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఆకర్షిస్తే తప్ప.. ప్రభు?తవాన్ని ఇబ్బంది పెట్టలేని పరిస్థితి వచ్చింది. అంటే కేసీఆర్ అంచనాలు తలకిందులు అయినట్లే. బీజేపీతో చర్చలను చూపించి.. కొంత మంది ఎమ్మెల్యేలను ఆపగలుగుతున్నారు కానీ.. ఆ విషయంపై స్పష్టత వస్తే మరికొంత మంది ఎమ్మెల్యేలు అదే బాట పడతారని అంచనా వేస్తున్నారు. మొత్తంగా కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు ఒకప్పుడు ఆయనను అపర చాణక్యుడిగా అందరి ముందు నిలబెట్టేవి. కానీ ఇప్పుడు రివర్స్ అవుతున్న సూచనలు కనిపిస్తున్నాయి.

# బేగంపేట్ శివారులో గుడుంబా తయారు సిద్ధంగా ఉన్న 1000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం..

రామగుండం: రామగుండం కమిషనరేట్ పెద్దపల్లి జోన్ రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని బేగంపేట్ గ్రామం కంచర చెరువు ప్రాంతం లో గుడుంబా తయారు చేస్తున్నారు అనే పక్కా సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ అధికారుల ఆదేశాల ప్రకారం సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ ఏలియా, మహేందర్, కానిస్టేబుల్స్ చంద్రశేఖర్, సునీల్, రాజేందర్ లు వెళ్లి తనిఖీ చేయగా అక్కడ సుమారు 1000 లీటర్లు గుడుంబా తయారీకి సిద్ధంగా ఉన్న బెల్లం పానకం గుర్తించడం జరిగింది. అదేవిధంగా 18 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకోవడం జరిగింది. గుడుంబా తయారీ చేస్తున్న నిందితుడు బొంతల రమేష్, బేగంపేట్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది ని చూసి పారిపోవడం జరిగింది.తదుపరి విచారణ నిమిత్తం స్వాధీనం చేసుకున్న 18 లీటర్ల గుడుంబాను రామగిరి పోలీస్ వారికి అప్పగించడం జరిగింది. 1000 లీటర్లు గుడుంబా తయారీకి సిద్ధం గా ఉన్న బెల్లం పానకం ధ్వంసం చేయడం జరిగింది.

# ఓపెన్ కాస్ట్ గనుల్లో వరద నీరు బొగ్గు ఉత్పత్తికి ఆటంకం

ఖమ్మం: అల్పపీడన ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురవడంతో సత్తుపల్లిలోని కిష్టారం, జేవిఆర్ ఓపెన్ కాస్ట్ గనుల్లోనీ వర్షపు నీరు చేరింది. కిష్టారం 18వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి,21 వేల క్యూబిక్ మీటర్ల మట్టివెలికితీత పనులకు అంతరాయం కలిగింది. జేవిఆర్ ఓపెన్ కాస్ట్ లో 10వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి, 14వేల మట్టి వెలికితీత పనులకు ఆటంకంఏర్పడింది. ఓపెన్ కాస్ట్ లో నిలిచిన నీటిని భారీ మోటార్ల సహాయంతో బయటకు పంపే ప్రయత్నం చేస్తున్నారు. భారీగా నష్టం వాటిల్లినట్టు సింగరేణి యాజమాన్యం చెబుతోంది.

# ఓరుగల్లును ముంచెత్తుతున్న వానలు....

వరంగల్, ఉమ్మడి వరంగల్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మరోవైపు ములుగు జిల్లాలోని బొగతా జలపాతానికి వరద నీరు పోటెత్తింది. దీంతో పర్యాటకులను అనుమతించటం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో తెలంగాణ నయాగార పిలుచుకునే ములుగు జిల్లాలోని బొగత జలపాతానికి వరద నీరు పోటెత్తింది. ములుగు జిల్లాతో పాటు ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో పైనుంచి వచ్చే వరదతో జలపాతం ఉప్పొంగుతోంది. చూపరులకు కనుల విందు చేస్తోంది.దీంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు బొగత సందర్శనకు వస్తుండగా, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. బొగత జలపాతం వద్ద నో ఎంట్రీ బోర్డు పెట్టేశారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వస్తున్న సందర్శకులు నిరాశతో వెనుదిరుగుతుండగా, ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని అక్కడి అధికారులు కోరుతున్నారు.బోగత వాటర్ ఫాల్స్ కు ఎగువన ఛత్తీస్ గడ్ రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో ములుగు జిల్లాలోని వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఆ వరద నీరు కాస్త బోగతకు పోటెత్తుతుండటంతో జలపాతం వద్ద ఉధృతి పెరుగుతోంది. ప్రమాదకర స్థితిలో ప్రవహిస్తుండటంతో అధికారులు బోగత సందర్శనను నిలిపి వేశారు. శుక్రవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటం, దాంతో జలపాతానికి మరింత వరద చేరే ఛాన్స్ ఉండంతో అటవీ, పోలీస్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వరద పోటెత్తడం వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయని అటవీశాఖ సిబ్బంది, పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ మేరకు వరద, లోతట్టు ప్రాంతాలకు ప్రజలు ఎవరూ వెళ్లకూడదని ములుగు జిల్లా వాజేడు పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లెక్సీ బోర్డు ఏర్పాటు చేశారు. ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పర్యాటకులకు వర్షాలు తగ్గేంత వరకు బోగత వద్దకు ఎంట్రీ ఉండదని స్పష్టం చేశారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఓపెన్ కాస్ట్ లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. భూపాలపల్లి కేటికే–2, కేటీకే –3 ఓపెన్ కాస్ట్ లో గనులోకి వరద నీరు చేరి 6 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. దీంతో సింగరేణికి సుమారు రెండు కోట్ల వరకు నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ లో వరద నీరు చేరడంతో 4 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగిగింది.భారీ వర్షాల వల్ల కాటారం?మేడారం రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కేశవాపూర్?–పెగడపల్లి మధ్య ఉన్న పెద్దవాగు, బొర్రవాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆ మార్గంలో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇదిలాఉంటే మహదేవపూర్ మండలం చంద్రుపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అన్నారం చంద్రుపల్లి మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాగా కాటారం మండలంలో వాగులో ఓ బొలెరో వాహనం కొట్టుకుపోయింది. గంగాపురి?మల్లారం గ్రామాల మధ్య కాజ్ వే పై నుంచి వరద నీరు ప్రవహిస్తుండగా, బొలెరో వాహనం కొట్టుకుపోగా, అందులో ఉన్న డ్రైవర్ మాత్రం ప్రాణాలతో బయటపడ్డాడు.ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉమ్మడి వరంగల్ లోని ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో శుక్రవారం అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ రెండు జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. భారీ వర్షాల ప్రభావం కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది

# ప్రభుత్వ యంత్రాంగాల ఉదాసీనత



## ప్రమాదంలో ప్రజారోగ్యం

వర్షాకాలం వచ్చిందంటే... దోమలు వణుకు పుట్టిస్తాయని, పారిశుద్ధ్య లేమికి తోడు, ప్రభుత్వ యంత్రాంగాల ఉదాసీనత కారణంగా దోమల సంతతి ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతోందన్నారు. దాని నివారణకు గట్టి చర్యలు చేపడితేనే ప్రమాదం తప్పుతుందని తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, న్యాయవాది రాజలింగు మోతే అన్నారు. శనివారం రామకృష్ణాపూర్ పట్టణంలో ఏర్పాటుచేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ..జూన్ సెప్టెంబర్ మధ్య కాలంలో ఆసుపత్రులు ఎక్కువగా జ్వర పీడితులతో కిక్కిరిసిపోతాయన్నారు. వారిలో చాలామంది పేదలు మధ్యతరగతి బలహీన వర్గాల ప్రజలే కావడంతో వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్సలకు అప్పు చేయాల్సి వస్తుంది అన్నారు.దోమల ద్వారా వ్యాపించే వ్యాధులలో అత్యంత ప్రమాదకరమైన వ్యాధిడెంగ్యూ అని,అది అత్యంత వేగంగా విస్తరించడం ఆందోళన కలిగించేఅంశం అన్నారు. పారిశుద్ధ్య చర్యలలో అలవిమాలిన నిర్లక్ష్యంతో పాటు, భూతాపము పెరగడమూ ఇందుకు కారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ లోగడ హెచ్చరించిందన్నారు. ప్రధాన కారణం పారిశుద్ధ్య లేమి. ఇప్పటికీ పల్లెలు, పట్టణాలల్లో మురుగునీటి పారుదల వ్యవస్థలు లేవని ఆయన అన్నారు.మురుగు కాలువలు నిర్మించిన, వాటిని సరిగ్గా నిర్వహించడం లేదన్నారు. మురుగు నీటి పారుదల వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు.

# కేయూ వర్శిటీ భూముల కబ్జా

వరంగల్, వేలాదిమంది మేధావులను, సామాజిక వేత్తలను సమాజానికి అందించిన విద్యాలయం వరంగల్ కాకతీయ యూనివర్సిటీ. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించి ఎంతోమందికి దేవాలయంగా మారింది కేయూ. కానీ, ఇప్పుడు వర్సిటీకి రక్షణ కరువైంది. నాటి పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పట్టింపు లేనితనంతో యూనివర్సిటీ కోసం కేటాయించిన రూ.వేలాది కోట్ల విలువ చేసే సుమారు 200 ఎకరాల భూములు కబ్జాకు గురయ్యాయి. ఇంటి దొంగలతోడు, అక్రమార్కులు దర్జాగా భూమి కబ్జా చేస్తున్నా కాపాడే నాథుడే కరువయ్యాడని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పరిస్థితి. యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం విద్యార్థులు, అధ్యాపకులు, మేధావులు అనేక ఉద్యమాలు చేసినా, గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో కబ్జాదారులు రెచ్చిపోయారు. అయితే, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తరువాత యూనివర్శిటీ భూముల పరిరక్షణ కోసం ప్రత్యేక దృష్టి పెట్టడంతో, కబ్జాకోరులు అందర్నీ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు తెరపైకి వచ్చాయి.కాకతీయ యూనివర్సిటీకి మొత్తం లస్కర్ సింగారం, కుమార్ పల్లి, పలివెల్పుల, శివనగర్ ప్రాంతాలలోని పలు సర్వే నెంబర్లలో మొత్తం 622 ఎకరాల 22 గంటల భూమి ఉండాలి. చాలావరకు కబ్జాలకు గురి కాగా, ప్రస్తుతం 400 ఎకరాల భూమి వరకే మిగిలిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఆక్రమణలు కొనసాగు తుండడంపై ఆందోళన పడుతున్నారు. మూడు సంవత్సరాల క్రితం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పేరేషన్ 13 మంది యునివర్సిటీ భూమి ఆక్రమించారని నిర్ధారించి వారికి నోటీసులు జారీ చేసింది. ఈ 13 మందిలో ముగ్గురు యూనివర్సిటీలో పని చేసే ఉద్యోగులే ఉన్నారు. కేయూ భూముల ఆక్రమణకు సంబంధించి విద్యార్థుల ఆందోళనతో దిగివచ్చిన అప్పటి వీసీ భూ సర్వే కమిటీ వేశారు. ఆ కమిటీలో కబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్న యునివర్సిటీ ఉద్యోగిని సభ్యునిగా చేయడం ఆశ్చర్యానికి గురి చేసింది. వర్సిటీ భూముల రక్షణపై అప్పటి వీసీకి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చు. కబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని భూ సంరక్షణ కమిటీలో సభ్యునిగా నియమిచ డంపై అనేక విమర్శలు వచ్చాయి. ఆందోళనలు జరిగాయి. చివరకు ఆరోపణలు ఎదుర్కొన్న వర్శిటీ ఉద్యోగిని కమిటీ నుంచి తప్పించారు. ఆ కమిటీ నివేదిక, అక్రమార్కుల చిట్టాను మాత్రం బయట పెట్టకపోవడం, భూమి రక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవ డంపై విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.కాకతీయ యూనివర్సి టీ భూమిలో గతంలో సీఆర్పీఎఫ్ బెటాలియన్‌కు స్థలం కేటాయించారు. అధికారుల అలసత్వం ఆసరాగా చేసుకుని బెటాలియ న్ వారికి కేటాయియించిన స్థలం కంటే పది రెట్లు ముందుకు జరిగి కంచె వేశారు. ఇప్పుడు రేకులతో కాంపౌండ్ కట్టి భూమి వారి ఆధీనం లోకి తీసుకునేందుకు ప్రయత్నం సాగిస్తున్నారు. సీఆర్పీఎఫ్ బెటాలియన్ అధికారులు కంచె వేసిన రేకులతో కాంపౌండ్ నిర్మాణం చేస్తున్నా అడిగే నాథుడే లేకుండా పోయాడు.యూనివర్సిటీలోని వందలాది ఎకరాల భూమి ఆక్రమించుకున్న కబ్జాదారులు రిజిస్ట్రేషన్, ఇండ్ల నిర్మాణం అనుమతి కోసం నకిలీ సర్వే నెంబర్లు వేసి పర్మిషన్లు తెచ్చుకుం టున్నారు. ఇప్పటికే విచ్చలవిడిగా నిర్మాణాలు జరిగాయి. వర్సిటీ భూములు కాపాడాల్సిన అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం మూలంగానే భూములు ఆక్రమణకు గురి అవుతున్నాయని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు సంవత్సరాల పాటు కాకతీయ యూనివర్సిటీకి వీసీగా పనిచేశారు తాటికొండ రమేష్. ఈయన హయాంలో సమయంలోనే ఆయన అనుచరులు సహా పలువురు కబ్జాదారులు రెచ్చిపోయి వర్సిటీ భూములు కబ్జా చేశారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. గతంలో వేసిన హద్దులు, ఏర్పాటు చేసిన బోర్డులు దాటి అక్రమ నిర్మాణాలు చేపట్టారని అంటున్నారు.అనేక సంవత్స రాలుగా విద్యార్థులు చేస్తున్న ఆందోళనలు చూసి రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ సర్కార్ యూనివర్సిటీ భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించింది. చుట్టూ 10 కిలోమీటర్ల మేర ప్రహరీ నిర్మాణం కోసం రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసింది. అయితే, అసలు చిక్కు ఇక్కడే మొదలైంది. యూనివర్సిటీ భూముల లెక్క తేల్చకుండా, హద్దులు నిర్ణయించకుండా ప్రహరీ నిర్మాణం చేస్తే నష్టం చేసి అక్రమార్కులకు లాభం చేసినట్టే అవుతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు పెద్దలు భూముల లెక్క తేల్చకుం డానే ప్రహరీ నిర్మాణం చేసి చేతులు దులుపుకుని కబ్జాలకు పాల్పడ్డ వారికి లాభం చేయాలనే ఉద్దేశంతో పని చేస్తున్నారా అనే అనుమానా లను లేవనెత్తుతున్నారు.

# ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు

### పొంగిపొర్లుతున్న వాగులు వంకలు

### సింగరేణి బొగ్గు గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పినపాక నియోజకవర్గం లో గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకి పినపాక, కరకగూడెం,మణుగూరు,అశ్వాపురం మండలాల్లోని వాగులు వంకలు చెరువులు పొంగిపొర్లుతున్నాయి.గ్రామీణ ప్రాంతాల్లో రహదారులను చిత్తడిగా మారడంతో ప్రజలు ఇండ్లకే పరమైతమైన్నారు. మణుగూరు సింగరేణి ఉపరితల బొగ్గు గనులలో 70 ఓఓ మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది ఉపరితల గనులలో వర్షపు నీరు చేరడంతో బొగ్గు రవాణాకు, ఉత్పత్తికి ( ఓబి) మట్టి పనులకు అంతరాయం కలిగింది 36 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి,2 లక్షల 90 వేల క్యూబిక్ మీటర్ల ( ఓబి) మట్టి వెలికితీత పనులకు ఆటంకం ఏర్పడింది, గత నాలుగు రోజుల వర్ష ప్రభావంతో సింగరేణి ఉపరితల బొగ్గు గనులు ఓసి2 ఓసి4 మణుగూరు ఓసి లో 85 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి 11 లక్షల 60 వేల క్యూబిక్ మీటర్ల (ఓబి) మట్టి వేలికితి పన్నులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అశ్వాపురం మండలంలో ఇసుక వాగు, కరకగూడెం మండలంలో పెద్దవాగు మణుగూరు మండలంలో కోడిపుంజుల వాగులు పొంగిపొర్లుతున్నాయి.వాగులు వంకలు పొంగి పొరడంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా అధికారులు భద్రత ఏర్పాట్లు చేశారు.

# శ్రావణ మాసం నుంచి టీఆర్ఎస్సే...

హైదరాబాద్, : కొన్ని సెంటిమెంట్లు బలంగా పాతుకుని పోతాయి. ప్రజల గుండెల్లో శాశ్వత ముద్రను వేస్తాయి. సాధారణంగా ఒక ఇంటిని మారి మరో ఇంటికి వెళ్లగానే మనసులో ఏదో తెలియని వెలితి కనిపిస్తుంది. ఖాళీ చేసి వచ్చిన చుట్టుపక్కల ఉన్నవారితో సాంగత్యం, ఆ ఇంటిపై పెంచుకున్న మమకారం, అనుబంధాలు, ఆప్యాయతలు కొత్తగా చేరిన ఇంటి చుట్టుపక్కల వాతావరణంతో కలవడానికి కొంత సమయం పడుతుంది. దశాబ్దం క్రితం ఉద్యమంలో కీలక పాత్ర వహించిన పార్టీగా టీఆర్ఎస్ కు మంచి పేరు ఉంది. ఆ పేరు బలంతోనే కేసీఆర్ అధికారంలోకి వచ్చారు. అదే సెంటిమెంట్ తో రెండోసారి కూడా అధికారంలోకి వచ్చారు. అయితే రెండో సారి అధికారంలోకి వచ్చాక కేసీఆర్ కు జాతీయ రాజకీయాలపై మోజు పెరిగింది. మరి ఏ జ్యోతిష్కుడు చెప్పాడో.. ఎవరు సూచించారో బిష్త్రగానీ పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్ కు మార్చేశారు. కనీసం తన సన్నిహితులైన మంత్రులు, అధికారులకు కూడా చెప్పకుండా పార్టీ పేరును బీఆర్ఎస్ గా మార్చే నిర్ణయం తీసుకున్నారు.ఎప్పుడైతే పార్టీ పేరు మారుస్తూ నిర్ణయం తీసుకున్నారో అప్పటినుంచి కేసీఆర్ కు కష్టాలు దాపురించాయి. గతేడాది కవిత అరెస్టుతో మొదలైన కష్టాలు..తదనంతరం అసెంబ్లీ ఎన్నికలలో అధికారం కోల్పోవడం, పార్లమెంట్ ఎన్నికలలో సున్నా ఫలితాలు, మరో పక్క వెంటాడుతున్న కేసులు, పార్టీ నుంచి వలసలు..ఈ పరిణామాల మధ్య పార్టీ భవితవ్యమే ప్రశ్నార్థకంగా మారింది. దీనితో బీఆర్ఎస్ శ్రేణులు, పార్టీ ప్రముఖుల నుంచి అధినేత కేసీఆర్ ను పార్టీ పేరు మార్చాల్సిందిగా డిమాండ్లు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. టీఆర్ఎస్ పేరులో తెలంగాణ అస్తిత్వం ఉందని..అదే బీఆర్ఎస్ అనగానే అస్తిత్వాన్ని కోల్పాయామని కార్యకర్తలు చెబుతున్నారు. గతంలో కూడా ఇదే ప్రతిపాదన కేసీఆర్ ముందుకు రాగా పార్టీ పేరు మార్చే ప్రసక్తే లేదని ప్రకటించారు. ఈ విషయంలో పునరాలోచించాలని పార్టీ సీనియర్లు ఎన్నిసార్లు కేసీఆర్‌కు తమ విన్నపాలు వినిపించినా గులాబీ బాస్ కేర్ చేయలేదు. పైగా పార్టీ మార్చడం అవమానకరంగా భావిస్తూ వచ్చారు.రాజకీయాలను పట్టుకువేళ్లాడితే ఇక్కడ పార్టీ ఖాళీ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. కేసీఆర్ మేనల్లుడు హరీష్ రావుకు కూడా బీఆర్ఎస్ పేరు మార్పు ఇష్టం లేనప్పటికీ మామ నిర్ణయం కాదనలేక ఇన్నాళ్లూ సైలెంట్ గా ఉన్నారు. రీసెంట్ గా జరిగిన ఓ సమావేశంలో పాత టీఆర్ఎస్ కండువాతో దర్శనమిచ్చారు. అయితే ఇది యాధృచ్ఛికమా లేక కావాలనే తన వ్యతిరేకత తెలపడానికా అని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. రీసెంట్ గా బండి సంజయ్ హరీష్ రావు బీజేపీలోకి రావాలనుకుంటే తమకేమీ అభ్యంతరం లేదని అన్నారు. దీనితో హరీష్ రావు పార్టీ మారతున్నారనే ప్రచారం ఊపందుకుంది. ఇప్పుడు హఠాత్తుగా టీఆర్ఎస్ కండువా ఎందుకు మార్చుకోవాల్సి వచ్చిందో అని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఇవన్నీ పక్కన పెడితే మొదటినుంచి సెంటిమెంట్ కే విలువనిచ్చే కేసీఆర్ మదిలో కూడా జరుగుతున్న పరిణామాలపై మనసులో ఆందోళన మొదలయింది. తాము తప్పు ఎక్కడ చేశామనే అంతర్మథనానికి లోనవుతున్నారు. అంతగా ప్రజావ్యతిరేకత ఎందుకు పెరిగిపోయిందో అర్థంకాని పరిస్థితిలో ఉన్నారు. అందుకే రాబోయే శ్రావణ మాసంలో మంచి ముహూర్తం చూసుకుని మళ్లీ బీఆర్ఎస్ ను టీఆర్ఎస్ గా మార్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కనీసం పేరు మార్పుతోనైనా పార్టీకి కలిసి వస్తుందేమో..తిరిగి పూర్వ వైభవం రావచ్చేమో అని భావిస్తున్నట్లు సమాచారం.

# పారిస్ ఒలింపిక్స్‌తో అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్ బై: హాకీ స్టార్ పీఆర్ శ్రీజేశ్

భారత పురుషుల హాకీ జట్టు గోల్‌కీపర్, మాజీ కెప్టెన్ పీఆర్ శ్రీజేశ్ కీలక ప్రకటన చేశాడు. పారిస్ ఒలింపిక్స్ తర్వాత అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలకనున్నట్లు పేర్కొన్నాడు.

ఇప్పటికే మూడుసార్లు ఒలింపిక్స్‌లో పాల్గొన్న శ్రీజేశ్.. పారిస్ ఒలింపిక్స్‌లో సత్తాచాటేందుకు సిద్ధమయ్యాడు. "పారిస్ ఒలింపిక్స్‌తో నా కెరీర్‌కు ముగింపు పలికేందుకు సన్నద్ధమయ్యా. విశ్వక్రీడల్లో మ్యాచ్‌ల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఈ ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచిన నా కుటుంబ సభ్యులు, సహచరులు, కోచ్‌లు, భారత హాకీ జట్టు అభిమానులకు ఎప్పటికీ కృతజ్ఞుడిని. నాపై విశ్వాసం ఉంచిన మీ అందరికీ ధన్యవాదాలు. నా సహచరులు బాధ, సంతోష సమయాల్లో పక్కనే ఉన్నారు. మేమందరం పారిస్ ఒలింపిక్స్‌లో మా అత్యుత్తమ ప్రదర్శనను అందించాలనుకుంటున్నాం. కచ్చితంగా మా పతకం రంగును మర్చాలనే కోరికతో ఉన్నాం" అని పీఆర్ శ్రీజేశ్ వివరించాడు.

36 ఏళ్ల శ్రీజేశ్ 2010 ప్రపంచ కప్‌లో అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు 328 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి భారత్ సాధించిన ఎన్నో చిరస్మరణీయ విజయాల్లో భాగమయ్యాడు. టోక్యో ఒలింపిక్స్‌లో భారత పురుషుల జట్టు కాంస్యం సాధించిన సంగతి తెలిసిందే. ఈ విజయంలో శ్రీజేశ్ కీలక పాత్ర పోషించాడు. గోల్ పోస్టుకు హీరోలా అడ్డు నిలిచి ఔరా అనిపించుకున్నాడు. జులై 26 నుంచి ప్రారంభం కానున్న పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ మొదటి మ్యాచ్‌లో న్యూజిలాండ్ (జులై 27న)తో తలపడనుంది. అనంతరం అర్జెంటీనా (జులై 29), ఐర్లాండ్ (జులై 30), బెల్జియం (ఆగస్టు 1), ఆస్ట్రేలియా (ఆగస్టు 2) ఢీకొట్టనుంది.




# మహిళల హాకీ జట్టుకు తొలిసారిగా ఇండియన్ నేవల్ అకాడమీలో శిక్షణ

ఇటీవల పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైన జాతీయ మహిళల హాకీ టీమ్ ప్రస్తుతం పునర్నిర్మాణ దశలో ఉంది. ఇందులోభాగంగా జట్టు తొలిసారిగా ఇండియన్ నేవల్ అకాడమీ(%×చీూ%)లో ట్రైనింగ్ పొందింది.

జట్టును మానసికంగా దృఢంగా మార్చి.. మరింత క్రమశిక్షణ తీసుకురావడమే లక్ష్యంగా ఈ క్యాంప్ నిర్వహించారు. కేరళలోని కన్నూరులో ఈ ప్రత్యేకమైన క్యాంప్ ఈనెల 15 నుంచి 21 వరకు జరిగింది. ఇలా ఇండియన్ నేవీలో శిక్షణ పొందడం హాకీ చరిత్రలో ఇదే తొలిసారి.

"ఇండియన్ నేవల్ అకాడమీలో క్రమశిక్షణ వాతావరణంలో ఈ పరివర్తన శిక్షణ శిబిరం నిర్వహించారు. జట్టులో ఐక్యత, నైపుణ్యాలు పెంపొందించుకోవడమే లక్ష్యంగా ఇది జరిగింది" అని హాకీ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. జట్టు నిర్మాణం, మానసిక బలం, నాయకత్వ లక్షణాలు, ఆత్మరక్షణ, సర్వైవల్ టెక్నిక్స్‌ను పెంపొందించుకోవడం కోసం దీనిని రూపొందించినట్లు చీఫ్ కోచ్ హరేంద్ర సింగ్ వెల్లడించారు. "నేవీ అధికారుల ఆధ్వర్యంలో మా ఆటగాళ్లు కఠినమైన శిక్షణ పొందారు. అది వారికి హాకీలోనే కాకుండా.. వ్యక్తిగత జీవితంలోనూ ప్రయోజనం చేకూర్చుతుంది" అని ఆయన వెల్లడించారు. ఈ శిక్షణలో భాగంగా హాకీ టీమ్‌కు, భారత టీమ్‌కు మధ్య స్నేహపూర్వక మ్యాచ్ నిర్వహించారు. శక్తి సామర్థ్యాలు పరీక్షించే వివిధ పోరాట కసరత్తుల్లో అథ్లెట్లు పాల్గొన్నారని.. వారి అంకితభావం స్ఫూర్తిదాయకంగా ఉందని ఐఎన్ఏ డిప్యూటీ కమాండెంట్ అడ్మిరల్ ప్రకాశ్ గోపాలన్ తెలిపారు.



# పారిస్ ఒలింపిక్స్.. ఆఖరి మజిలీలో ఆశ తీర్చుకుంటారా!

రోహన్ బోపన్న (టెన్నిస్).. దీపిక కుమారి (ఆర్చరీ).. శరత్ కమల్ (టేబుల్ టెన్నిస్)! ఈ ముగ్గురు తమ ఆటల్లో ఎంతో పేరు సంపాదించారు.. స్టార్లుగా ఎదిగారు.

ఆ ఆటలకు చిరునామాగా మారారు. కానీ వాళ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఒక్క వెలితి ఉండిపోయింది. ఆ వెలితి తీర్చుకోకుండానే కెరీర్లు ముగిస్తాయా అన్న బాధ కూడా వారిలో ఉంది. అదే ఒలింపిక్ పతకం! క్రీడాకారులెవరికైనా అంతిమ లక్ష్యం ఇదే. బోపన్న, దీపిక, శరత్ ఇప్పుడు తమ కెరీర్‌లో చివరిసారి ఆ లక్ష్యాన్ని అందుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. 'వన్ లాస్ట్ షాట్' అంటూ ఈ ముగ్గురూ పారిస్‌కు వెళ్లారు. భారత్‌కు పతకంతో తిరిగి రావాలనే సంకల్పంతో బరిలో దిగుతున్నారు.

**పెద్దోడు పట్టేస్తాడా?**

పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న భారత బృందంలో 44 ఏళ్ల రోహన్ బోపన్నే పెద్ద వయస్కుడు. లేటు వయసులో ఘాటుగా ఆడుతున్న ఈ టెన్నిస్ స్టార్.. తన చివరి ప్రయత్నంలో పతకం పట్టాలనే సంకల్పంతో ఉన్నాడు. ఇటీవల అతడి ఫామ్ చూస్తే అదంత పెద్ద కష్టం కాదేమో అనిపిస్తుంది. ఈ ఏడాది బోపన్న ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో పాటు మియామి టైటిళ్లు గెలిచాడు. అయితే పారిస్‌లో అతడు ఆడేది భారత ఆటగాడు శ్రీరామ్ బాలాజీతో! ఇప్పటివరకు మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జతగా దూసుకెళ్తున్న బోపన్న.. బాలాజీతో ఏమేరకు సమన్వయం సాధిస్తాడన్నది ప్రశ్న. అన్నీ కలిసొస్తే పోడియంపై నిలవగల సత్తా భారత జంటకు ఉంది. 2016 రియో ఒలింపిక్స్‌లో బోపన్నకు ఒలింపిక్స్ పతకం సాధించే సువర్ణావకాశం చేజారింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సానియామీర్జా జతగా అతడు సెమీఫైనల్‌కు చేరాడు. సెమీస్‌లో కొద్దిలో భారత జోడీ ఓడింది. కాంస్యమైనా సాధిస్తుంది అనకుంటే అక్కడా బోపన్న ద్వయానికి కలిసిరాలేదు. ఇప్పుడా అనుభవంతో బోపన్న ఆఖరి ప్రయత్నంగా పారిస్‌లో దిగుతున్నాడు. మరి పతకం తెస్తాడా, లేదా అనేది ఆసక్తికరం.

**2004 నుంచి..**

ఒలింపిక్స్‌లో ఆచంట శరత్‌కమల్‌ది అలుపెరుగని ప్రయాణం. 2004 ఏథెన్స్ ఒలింపిక్స్ నుంచి క్రమంతప్పకుండా క్రీడలకు వెళ్తున్న అతడు పతకం కోసం చకోర పక్షిలా వేచి చూస్తూనే ఉన్నాడు. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు ఎంతో అనుభవం, పరిణతి సంపాదించిన శరత్.. తన చివరి ప్రయత్నంలో సఫలం కావాలనే పట్టుదలతో ఉన్నాడు. అతడి ఆశ కూడా అత్యాశ కాదు. ఎందుకంటే ఇటీవల శరత్ ఫామ్ బాగుంది. యువ క్రీడాకారులతో పోటీపడుతూ ర్యాంకుల్లోనూ మెరుగయ్యాడు. కామన్వెల్త్, ఆసియా క్రీడల్లో పతకాలతో సత్తా చాటాడు. ముఖ్యంగా 2022 కామన్వెల్త్ క్రీడల్లో సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్, పురుషుల టీమ్ విభాగాల్లో స్వర్ణాలతో మెరిశాడు. ఈనేపథ్యంలో ఒలింపిక్స్‌లో అదరగొట్టి పతకం పట్టేయాలని అతడు కలలుగంటున్నాడు. ఒకవేళ అది సాధ్యమైతే నిజంగా అద్భుతమే.. ఓ చరిత్రే! ఎందుకంటే టీటీలో ఇప్పటివరకు ఒక్క ఒలింపిక్ పతకం రాలేదు. సింగిల్స్, డబుల్స్‌లోనే కాదు మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ శరత్ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాడు.



**గురి కుదిరేనా!**

దీపిక కుమారి.. ఆర్చరీలో నంబర్‌వన్ కూడా అయింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్, ప్రపంచకప్‌లలో ఈ ఝార్ఖండ్ అమ్మాయి ఎన్నో పతకాలు కొల్లగొట్టింది. కానీ ఒలింపిక్స్‌కు వచ్చేసరికి రిక్తహస్తమే. ప్రతిసారీ ఎన్నో ఆశలతో వెళ్లడం వెనక్కి వచ్చేయడం. 2012 లండన్ ఒలింపిక్స్ మొదలుపెట్టి ఆమెకు ప్రతిసారీ నిరాశే ఎదురైంది. ఒలింపిక్స్‌లో క్వార్టర్ ఫైనల్‌కు వెళ్లడమే దీపికకు అత్యుత్తమ ప్రదర్శన. 2020 ఒలింపిక్స్ తర్వాత ఈ స్టార్ పని అయిపోయిందని అంతా అనుకున్నారు. పెళ్లి కావడం..బిడ్డకు జన్మనివ్వడంతో ఇక ఆమె ఆటలో కొనసాగదని భావించారు. దీనికితోడు అనారోగ్య సమస్యలు చాలాకాలం దీపికను ఆర్చరీకి దూరం చేశాయి.

అయినా మొక్కవోని దీక్షతో ఆమె పునరాగమనం చేసింది. ఆర్చర్ అయిన భర్త అతానుదాస్ అండతో ఆటలో మళ్లీ తన మార్కు చూపిస్తోంది. 2024 షాంగై ప్రపంచకప్‌లో రజతంతో సత్తా చాటింది. అదే క్రమంలో పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన దీపిక ఈసారి పతకం తెస్తాననే ధీమా వ్యక్తం చేస్తోంది. సింగిల్స్, టీమ్ విభాగాల్లో ఆమె అదృష్టం పరీక్షించుకుంటోంది.

# కోహ్లి కాదు.. సచిన్ టెస్టు స్కోరును అధిగమించే బ్యాటర్ అతడే: మైకెల్ వాన్

టెస్టు క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ సచిన్ తెందూల్కర్. 200 టెస్టుల్లో 15,921 పరుగులు చేసిన సచిన్ దరిదాపుల్లో ఎవరూ లేరు.

ప్రస్తుత క్రికెటర్లలో ఇంగ్లాండ్ బ్యాటర్ జో రూట్ మాత్రమే ఈ రేసులో నిలిచాడు. ఇప్పటి వరకు 142 టెస్టులు ఆడిన రూట్ 11,940 పరుగులతో ఉన్నాడు. తాజాగా విండీస్‌పై రెండో టెస్టులోనూ ఈ ఇంగ్లాండ్ బ్యాటర్ సెంచరీ సాధించాడు. దీంతో భవిష్యత్తులో సచిన్ రికార్డును అధిగమించే సత్తా రూట్‌కు మాత్రమే ఉందని.. విరాట్, కేన్ విలియమ్సన్ వల్ల కష్టమేనని ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైకెల్ వాన్ వ్యాఖ్యానించాడు. "మరికొద్ది రోజుల్లో ఇంగ్లాండ్ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా రూట్ నిలుస్తాడు. అలెస్టర్ కుక్ (12,472) కంటే కాస్త వెనుకనే ఉన్నాడు. భవిష్యత్తులో సచిన్ (%ఝఎష్ట్రఱఅ%) రికార్డునూ అధిగమిస్తాడు. గతంలో మాదిరిగా ఆచితూచి ఆడటం లేదు. దూకుడుగానే పరుగులు రాబడుతున్నాడు. నాణ్యమైన క్రికెట్ ఆడుతున్నాడు" అని మైకెల్ వాన్ తెలిపాడు. ఈ జాబితాలో కోహ్లి (8,848), కేన్ (8,743) చాలా దూరంలో ఉన్నారు.

**ఆరో స్థానంలోకి ఇంగ్లాండ్**

వెస్టిండీస్‌పై రెండో టెస్టులో ఇంగ్లాండ్ 241 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. 384 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన విండీస్ 143 రన్స్‌కే ఆలౌటైంది. ఇంగ్లాండ్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ 400ం పరుగులు సాధించడం గమనార్హం. ఇదే టెస్టు క్రికెట్ చరిత్రలో అరుదైన ఘనత. తాజా విజయంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఇంగ్లాండ్ (31.25 శాతం) ఆరో స్థానానికి చేరుకుంది. వచ్చే ఏడాది మార్చిలోగా తొలి రెండు స్థానాల్లో నిలిచే జట్లు ఫైనల్‌లో తలపడతాయి. ప్రస్తుతం భారత్ (68.52 శాతం), ఆస్ట్రేలియా (62.50 శాతం) ముందు వరుసలో కొనసాగుతున్నాయి. విండీస్‌తో చివరి టెస్టు మ్యాచ్ (జులై 26-30)లోనూ ఇంగ్లాండ్ గెలిస్తే పాక్‌ను వెనక్కి నెట్టి ఐదో స్థానంలోకి వచ్చే అవకాశం ఉంటుంది.




# విరాట్‌తో నా రిలేషన్‌షిప్.. టీఆర్‌పీ కోసం కాదు: గంభీర్

శ్రీలంక పర్యటనకు ముందు భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ తొలిసారి ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు.

కొందరు యువకులకు అవకాశం రాకపోవడం, విరాట్‌తో సంబంధాలు, సీనియర్ల విషయంపైనా స్పందించాడు. ఈ సమావేశంలో చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ పాల్గొన్నాడు.

**10 టెస్టులు ఆడాల్సి ఉంది.. జడ్డూనే కీలకం**

"శ్రీలంక పర్యటన తర్వాత భారత్ దాదాపు 10 టెస్టులు ఆడనుంది. మాకు అత్యంత కఠిన సవాల్ ఎదురుకానుంది. తప్పకుండా పది టెస్టుల్లోనూ విజయం సాధిస్తామనే నమ్మకంతో ఉన్నాం. రవీంద్ర జడేజా మాకు అత్యంత కీలక ప్లేయర్. ఆ పదింటి కోసమే అతడికి విశ్రాంతినిచ్చాం. అతడిని జట్టు నుంచి పక్కన పెట్టలేదు. భవిష్యత్తులో టెస్టు సిరీస్‌ల కోసం విరామం ఇచ్చామంతే"

అవన్నీ పబ్లిక్ కోసం కాదు.. "టీఆర్‌పీని పెంచడం కోసమే విరాట్‌తో నా సంబంధం ఉండదు. ఇప్పుడు మేమిద్దరం భారత్ కోసం ఆడేందుకు సిద్ధమవుతున్నాం. 140 కోట్ల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్నాం. ఆఫ్ ఫీల్డ్‌లోనూ కోహ్లితో నాకు చక్కటి అనుబంధం ఉంది. ఇదంతా పబ్లిక్ కోసం కాదు. నేను అతడితో ఎన్నిసార్లు మాట్లాడాననేది చెప్పాల్సిన పని లేదు. ప్రపంచస్థాయి క్రికెటర్. మంచి ప్రొఫెషనల్. మేమిద్దరం ఇలానే కొనసాగతామని ఆశిస్తున్నా.

విరాట్, రోహిత్, బుమ్రా వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ అత్యంత కీలకం. బుమ్రా అరుదైన బౌలర్. అతడిని కాపాడుకోవడం అత్యవసరం. అతి ముఖ్యమైన టోర్నీలు లేదా మ్యాచ్‌లకు మాత్రమే అతడిని ఎంపిక చేయాలి. కేవలం అతడే కాకుండా.. ఫాస్ట్ బౌలర్లకూ ఇది వర్తించే అంశమే. సీనియర్ బౌలర్ షమీ తప్పకుండా జట్టులోకి వస్తాడు. మేం సెప్టెంబర్ 19న టెస్టు ఆడబోతున్నాం. ఆ గడువే అతడి గోల్. ఎన్‌సీఏలోని వారితో ఈ విషయంపై ఇప్పటికే మాట్లాడా. బౌలింగ్ ప్రాక్టీస్ చేయడం కూడా ప్రారంభించాడు" అని గంభీర్ వివరించాడు.




**కీలక విషయాలను వెల్లడించిన అగార్కర్**

"శుభ్‌మన్ గిల్ మూడు ఫార్మాట్లలో ఆడే ప్లేయర్. గతేడాదిగా అతడి నాయకత్వం గురించి డ్రెస్సింగ్ రూమ్‌లోనూ మాట్లాడుకోవడం విన్నాం. అతడికి అవకాశం ఇచ్చి మరింత మెరుగయ్యేలా చూసేందుకు ప్రయత్నిస్తున్నాం. అంతేకానీ, ఇక్కడ దానికి గ్యారంటీ ఇవ్వడం లేదు. కేఎల్ రాహుల్ కూడా చాన్నాళ్లకు జట్టులోకి వస్తున్నాడు. రిషభ్ పంత్‌పై పని ఒత్తిడి పెట్టదల్చుకోలేదు. వరల్డ్ కప్‌లో అతడు చాలా కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు. అభిషేక్ శర్మ, రుతురాజ్ అద్భుత ప్లేయర్లు. కానీ, పర్యటన కోసం 15 మంది ఆటగాళ్లనే ఎంపిక చేయాల్సి ఉంటుంది. రింకు సింగ్ వరల్డ్ కప్ ముందు చాలా బాగా ఆడాడు. కానీ, అతడిని టోర్నీ కోసం 15 మందిలో సెలక్ట్ చేయలేకపోయాం" అని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ (%ూ౦యఱ్‌ూ౯్గుతీఝతీ%) వెల్లడించాడు.

# సూర్యకు ఇవ్వడానికి కారణమదే.. 2027 వన్డే ప్రపంచ కప్ ఆడే సత్తా వారికుంది: గౌతమ్ గంభీర్

టీమ్‌ఇండియా ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన గౌతమ్ గంభీర్ మొదటిసారి ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నాడు. అతడితోపాటు చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ కూడా ఉన్నాడు.

ఈసందర్భంగా హార్దిక్ పాండ్యకు టీ20 కెప్టెన్సీపై స్పందించారు. అదేవిధంగా గంభీర్ తన విజన్ ఏంటో వెల్లడించాడు.

"ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన జట్టును నడిపించేందుకు వచ్చా. టీ20 వరల్డ్ కప్ ఛాంపియన్, డబ్ల్యూటీసీ, వన్డే ప్రపంచకప్‌ల్లో రన్నరప్‌గా భారత్ నిలిచింది. జట్టులోని ప్రతిఒక్కరితో నాకు మంచి సంబంధాలే ఉన్నాయి. బీసీసీఐ కార్యదర్శి జైషా బాగా తెలుసు. సోషల్ మీడియాలో చాలా విషయాలపై వ్యాఖ్యలు వస్తుంటాయి. వాటన్నింటినీ పక్కనపెట్టి మా బాధ్యతలపై దృష్టిపెడతాం. ఇక్కడ గౌతమ్ గంభీర్ ముఖ్యం కాదు. టీమ్‌ఇండియాకే మొదటి ప్రాధాన్యం. కోహ్లి, రోహిత్‌కు ఇంకా క్రికెట్ ఆడే సత్తా ఉంది. ఫిట్‌నెస్, ఫామ్ కాపాడుకుంటూ ఉంటే 2027 వరల్డ్ కప్‌లోనూ ఆడే ఛాన్స్ ఉంది." అని గంభీర్ తెలిపాడు.

**డ్రెస్సింగ్‌రూమ్‌పై గంభీర్..**

"ఆటగాళ్లకు స్వేచ్ఛ ఇవ్వడమే కీలకం. ప్రతి ఆటగాడిపై నమ్మకం ఉంచి వారిని ప్రోత్సహించేందుకు ప్రయత్నించడమే హెడ్ కోచ్‌గా నా విధి. నా మద్దతు ఎప్పుడూ ఉంటుందనే ప్రతి ఒక్కరికి హామీ ఇస్తున్నా. సంతోషంగా ఉండే డ్రెస్సింగ్ రూమ్ తప్పకుండా సక్సెస్ అవుతుంది. అదేవిధంగా నా సహాయక సిబ్బంది కూడా సపోర్టివ్‌గా ఉంటారు. ఏ విషయాన్ని సంక్లిష్టం చేయను. నేను కూడా అలా ఉండను. సహాయ సిబ్బంది ఇంకా ఫైనలైజ్ కాలేదు. రైయన్, అభిషేక్ నాయర్‌తో కలిసి పనిచేశా. ప్లేయర్ల నుంచి మంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నా. ఈ సిరీస్‌కు వారితోపాటు బహుతులే పనిచేస్తారు" అని వెల్లడించాడు.




**పాండ్య విషయంపై అగార్కర్**

"హార్దిక్ పాండ్య మాకు అత్యంత కీలకమైన ప్లేయర్. అయితే, కెప్టెన్సీ నిర్ణయం తీసుకొనేటప్పుడు అన్ని మ్యాచ్‌లు ఆడగలరా? లేదా? అనేది ఆలోచించాం. అతడి నైపుణ్యాలను తక్కువ చేయడం లేదు. ఫిట్‌నెస్ విషయంలోనే అతడికి కాస్త సవాల్ ఎదురవుతుంది. నిర్ణయం తీసుకోవడంలో కోచ్, సెలక్టర్లకు ఇదే క్లిష్టంగా మారింది. వచ్చే టీ20 ప్రపంచకప్ మరో రెండేళ్లలో జరగనుంది. అందుకే సూర్యకుమార్ వైపు మొగ్గు చూపాం. తప్పకుండా సారథిగా విజయవంతమవుతాడని భావిస్తున్నాం" అని అజిత్ అగార్కర్ తెలిపాడు.

# రూసో మెరుపు సెంచరీ.. జాఫ్నా కింగ్స్ ఖాతాలో నాలుగో టైటిల్

లంక ప్రీమియర్ లీగ్‌లో జాఫ్నా కింగ్స్ రికార్డు సృష్టించింది. టోర్నీ ఆసాంతం అదరగొట్టిన జాఫ్నా జట్టు నాలుగోసారి విజేతగా నిలిచింది. ఆదివారం గాలే మార్వెల్స్ తో జరిగిన ఫైనల్లో 9 వికెట్ల తేడాతో విజయభేరి మోగించింది. భారీ ఛేదనలో జాఫ్నా చిచ్చరపిడుగు రిలే రూసో (106 నాటౌట్) మెరుపు సెంచరీతో కదం తొక్కాడు. అతడికి కుశాల్ మెండిస్ (72 నాటౌట్) తోడవ్వడంతో జాఫ్నా కింగ్స్ మరోసారి చాంపియన్ అయింది. ఇప్పటికే మూడు టైటిళ్లు గెలిచిన ఆ జట్టు చరిత అసలంక కెప్టెన్సీలో తొలి ట్రోఫీని ముద్దాడింది.

కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో ఆదివారం పరుగుల విందు అభిమానులను అలరించింది. జాఫ్నా కింగ్స్, గాలే మార్వెల్స్ ఆటగాళ్ల బౌండరీల జడివానలో ప్రేక్షకులు తడిసిముద్దయ్యారు. అయితే.. భారీ ఛేదనలో వార్ వన్‌సైడ్ చేస్తూ జాఫ్నా కింగ్స్ టైటిల్‌ను తన్నుకుపోయింది.

**రాజపక్సే మెరుపులతో..**

తొలుత ఆడిన గాలే మార్వెల్స్ భారీ స్కోర్ కొట్టింది. భానుక రాజపక్సే(82) అర్ధ శతకంతో చెలరేగగా.. టిమ్ సీఫర్ట్ (47) సాధికారిక ఇన్నింగ్స్ ఆడాడు. దాంతో, నిర్ణీత ఓవర్లలో గాలే జట్టు 6 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. అనంతరం ఛేదనకు దిగిన జాఫ్నా కింగ్స్ తొలి ఓవర్లోనే ఓపెన్ ప్రథుమ్ నిస్సంక(0) వికెట్ కోల్పోయింది. అయినా జాఫ్నా ఆటగాళ్లు ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వలేదు.

ఓపెనర్ కుశాల్ మెండిస్(72 నాటౌట్) అండగా రిలీ రూసో(106 నాటౌట్, 53 బంతుల్లో 9 ఫోర్లు, 7 సిక్సర్లు) సుడిగాలి ఇన్నింగ్స్ ఆడాడు. గాలె మార్వెల్స్ బౌలర్లను ఊచకోత కోస్తూ బౌండరీల వర్షం కురిపించాడు. సెంచరీతో గాలే విజయావకాశాల్ని దెబ్బతీశాడు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**